


Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 11 | మంగళవారం 04 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# స్తంభించిన పార్లమెంట్

- నీట్ పేపర్ లీక్, అయోధ్య రామాలయ విరాళాల చోరీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన
- నిరసనల మధ్యే ఉభయ సభల్లో రెండు బిల్లులు
- ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఘటనలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ స్తంభించింది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన అణచివేతకు హోం మంత్రి సరైన వివరణ ఇచ్చే వరకు పార్లమెంటులో తమ ఆందోళనను కొనసాగి స్తామని ప్రతిపక్షం పేర్కొంది. ఈ డిమాండ్ తో లోక్‌సభ, రాజ్యసభలలో ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వచ్చి ఆందోళన చేయడంతో సభా కార్యకలాపాలకు పలుమార్లు అంతరా యం ఏర్పడింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల అరాచకాలకు, అయోధ్యలోని రామ మందిర దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పార్లమెంటు వెలుపలా నిరసన తెలిపాయి. 'అమిత్ షా పార్ల మెంటుకు ఎందుకు రావడం లేదు?' అంటూ రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించడంతో పాటు ప్లకార్డులతో ఆందోళన చేపట్టాయి. వర్షాకాల సమావేశాలు మూడో వారంలోకి ప్రవేశించినప్పటికీ ఉభయ సభలలో ప్రతిపక్షాలు కొనసాగిస్తున్న ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి పెద్ద

- మిగతా 2లో..

### హామీని బాధ్యతగా

# అమలు చేయండి

- మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలి
- విద్యార్థులపై అనవసర చట్టపరమైన చర్యలు కొనసాగించొద్దు
- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం... ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన హామీలకు

- మిగతా 2లో..



### చక్రవర్తి తన

# డిగ్రీ చూపిస్తారా?

- ప్రశ్నించిన అభిజిత్ దీప్కే
-స్కాలర్‌షిప్‌తో, రుణంతో చదువుకున్నానని వెల్లడి
- సీజేపీ సామాజిక ఉద్యమంగానే కొనసాగుతుందని స్పష్టీకరణ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలలో దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే లక్ష్యం గా బీజేపీ సర్కార్ పావులు కదుపుతుంది. దీప్కే అమెరికా చదువుకునేందుకు డబ్బులు ఎలా వచ్చాయంటూ బీజేపీ నాయకులు ఆర్‌టీఐ దరఖాస్తును దాఖలు చేశారు. దీనిపై అభిజిత్ స్పందిస్తూ తన డిగ్రీని, విద్యా రుణాలకు సంబంధించి పత్రాలను బహిరంగంగా చూపించడానికి తాను సిద్ధమని, మరి బీజేపీ నేతలు కూడా తమ విద్యార్హతలను వెల్లడిస్తారా? అంటూ ఆయన సోమవారం ప్రశ్నించారు. "నాకు వచ్చిన స్కాలర్‌షిప్ లేఖను, విద్యా రుణం తీసుకున్న లేఖను చూపించడానికి నేను సిద్ధమే, మరీ మీ చక్రవర్తి కూడా తన డిగ్రీ చూపిస్తారా?' అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. బోసన్‌లో పబ్లిక్ రిలేషన్స్‌లో కోర్సు

- మిగతా 2లో..

# బీజేపీకి ఎదురుగాలి

- ◆ మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు
- ◆ గుజరాత్‌లో కమలంకు తగ్గిన మెజార్టీ
- ◆ కాషాయ కంచుకోటలో ప్రశాంత్ కిషోర్ ఘన విజయం

బంకిపూర్ - సూర్య వాస్తవం

జెన్ జీ ఉద్యమంతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించిన ఉప ఎన్నికల ఫలితాల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడి స్థానాన్ని ఆ పార్టీ కోల్పోయింది. మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గం లో కాంగ్రెస్ గెలుపొందగా, గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. ఇక బీజేపీకి కంచుకోట అయిన బంకిపూర్ నియోజకవర్గంలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఘన విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై ప్రశాంత్ కిషోర్ 18,953 ఓట్ల తేడాతో గెలుపొందారు.

- మిగతా 2లో..





### సీఎం విజయ్‌కు

# తొలి అగ్నిపరీక్ష..

- కావేరి జలాలపై రాజకీయ రగడ!
- కావేరి జలాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు డీఎంకే డిమాండ్
- ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరించిన విజయ్ ప్రభుత్వం
- ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేశామంటున్న అధికార పార్టీ
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా తంజావూరులో భారీ ఆందోళనకు డీఎంకే పిలుపు

చెన్నై-సూర్య వాస్తవం

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌కు తొలి రాజకీయ అగ్నిపరీక్ష ఎదురైంది. దశాబ్దాలుగా నలుగుతున్న కావేరి జలాల వివాదం విషయంలో ఆయన వైఖరి ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

- మిగతా 2లో..

### రవాణా శాఖలో అనవసర

# నిబంధనలు తొలగించండి

- ◆ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ◆ ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- ◆ రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించి, సేవలు సులభతరం చేయాలని సూచన
- ◆ పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ

అమరావతి - సూర్య వాస్తవం

రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై

- మిగతా 2లో..



### కర్ణాటక కేబినెట్ విస్తరణతో

# కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి

- చివరి నిమిషంలో జాబితా నుంచి మంకాల్ వైద్య పేరు తొలగింపు
- సీనియర్ లింగాయత్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు చోటు
- పదవులు దక్కని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం

బెంగళూరు- సూర్య వాస్తవం

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది. మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు

- మిగతా 2లో..



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# హామీని బాధ్యతగా అమలు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లనూ పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

# సీఎం విజయ్‌కు తొలి అగ్నిపరీక్ష..

(మొదటిపేజీ తరువాయి)

ఈ అంశంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఆయన ప్రభుత్వం తిరస్కరించడంతో రాజకీయ వేడి రాజుకుంది. కావేరి సమస్యపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష డీఎంకే, ఇతర పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. అయితే, ఈ డిమాండ్‌ను విజయ్ నేతృత్వంలోని టీవీకే (తమిళగ వెట్రి కళగం) ప్రభుత్వం తోసిపుచ్చింది. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు ఈ అంశాన్ని వాడుకుంటున్నాయని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని ఆరోపిస్తోంది.

ఈ విషయంపై టీవీకే సీనియర్ నేత సీటీఆర్ నిర్మల్ కుమార్ స్పందిస్తూ.. "ఇప్పటికే అసెంబ్లీలో అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా తీర్మానం చేశాం. అలాంటప్పుడు మళ్లీ అఖిలపక్ష సమావేశం ఎందుకు? కేవలం మా ముఖ్యమంత్రికి సమస్యలు సృష్టించాలనే డీఎంకే చూస్తోంది తప్ప, తమిళనాడు సంక్షేమం వారికి పట్టదు" అని విమర్శించారు. గతంలో కావేరి వివాదం తీవ్రమైనప్పుడు డీఎంకే, ఏఐఏడీఎంకే ప్రభుత్వాలు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాయి. కానీ, టీవీకే ప్రభుత్వం భిన్నమైన వ్యూహంతో ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ఈ సమస్యపై చర్చించేందుకు సీఎం విజయ్ నేరుగా బెంగళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడాలని భావించినా, అక్కడి ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఆ పర్యటన రద్దయినట్లు సమాచారం. ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేడు (ఆగస్టు 3న) తంజావూరులో రైతుల సమస్యలు, కావేరి అంశంపై భారీ నిరసన చేపట్టాలని డీఎంకే నిర్ణయించింది.

# రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

సీఎం కీలక సూచనలు చేశారు.

రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు. సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు. వీరితో పాటు సీనియర్ నేతలు హంపనగౌడ బదర్లి, అశోక్ పట్టణ్, రాఘవేంద్ర హిట్నాల్ వంటి వారు కూడా తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. మరోవైపు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన్వీర్ సేఠ్‌కు మంత్రి పదవి ఇవ్వలేదన్న మనస్తాపంతో ఆయన అనుచరుడు ఒకరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ పరిణామాల మధ్యే సోమవారం సాయంత్రం లోక్ భవన్ ప్రాంగణంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- అనంతపురం డీఈఓగా అయూబ్ హుస్సేన్ నియామకం..!
- నెలల నిరీక్షణకు తెర.. విద్యాశాఖకు కొత్త అధికారి
- ఇప్పటికైనా జిల్లాలో విద్యాశాఖ పరిపాలన గాడిన పడుతుందా...?



**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)గా ఎట్టకేలకు అయూబ్ హుస్సేన్ నియమితులయ్యారు. ప్రస్తుతం కర్నూలు జిల్లా డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా, ఇంచార్జ్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను అనంతపురం డీఈఓగా నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డీఈఓగా పనిచేసిన ప్రసాద్‌బాబు బదిలీ అనంతరం, జిల్లాకు పూర్తిస్థాయి డీఈఓను నియమించకుండా డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావుకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే, పూర్తిస్థాయి డీఈఓ నియామకంలో జాప్యంపై ఉపాధ్యాయ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఇంచార్జ్ పాలనలో అధికారిక వనరుల వినియోగం, కార్యాలయ నిర్వహణపై పలు విమర్శలు, ఆరోపణలు వెలువడ్డాయి. ఈ అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉందని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. విద్యాశాఖ పరిపాలన గాడి తప్పిందన్న విమర్శలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు సమర్థవంతమైన అధికారిని నియమిస్తారని ఉపాధ్యాయులు, విద్యాశాఖ వర్గాలు ఆశిస్తూ వచ్చాయి. అయితే, నియామక ప్రక్రియలో జాప్యం కొనసాగడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరకు కర్నూలు డైట్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ అయూబ్ హుస్సేన్ ను అనంతపురం డీఈఓగా నియమించారు. అయూబ్ హుస్సేన్ కు సర్వీసు కాలం తక్కువగా ఉందని, మరో నాలుగు నెలల్లో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నట్లు సమాచారం.

**విద్యారంగంపై అవగాహన ఉన్న అధికారి..**

కర్నూలు జిల్లా డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా, ఇంచార్జ్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న అయూబ్ హుస్సేన్ కు ఉపాధ్యాయ శిక్షణ, విద్యా పరిపాలన అంశాలపై అనుభవం ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అనంతపురం డీఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లాలో విద్యాశాఖ పరిపాలనను గాడిలో పెట్టడంతో పాటు పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల సమస్యలు, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తారని ఉపాధ్యాయ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# స్తంభించిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

అఎదురుదెబ్బగా పరిణమించాయి. ఈ భారీ నిరసనల మధ్యే ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచే చట్ట సవరణ లోక్‌సభలో ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. అదే విధంగా ప్రతిపక్షాల నిరసనల మధ్యే రాజ్యసభలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ సహకార (సవరణ) చట్టానికి మద్దతుగా తన నివేదికను సమర్పించింది. స్వల్ప మార్పులతో ఈ బిల్లును చట్టంగా మార్చాలని జేపీసీ సిఫారసు చేసింది. లోక్‌సభలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్ స్తంభించిన పార్లమెంట్ సవరణ బిల్లు, కేంద్ర సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్.. ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇది బ్యాంకు రికార్డులను కోర్టులో విశ్వసనీయ సాక్ష్యంగా స్వీకరించడానికి అనుమతిస్తుంది. 1891 నాటి చట్టం స్థానంలో వచ్చిన ఈ కొత్త చట్టంలో, డిజిటల్, ఎలక్ట్రానిక్, వర్చువల్ రికార్డులను బ్యాంకు రికార్డులుగా చేర్చడానికి నిబంధనలు ఉన్నాయి.

ఇదిలా ఉండగా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ ఉభయ సభలలో ప్రతిపక్షాల నిరసనలను అణచివేసేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల చర్య, అయోధ్యలో దారుణాలపై వివరంగా చర్చించకుండా నిరసనల నుంచి వెనక్కి తగ్గబోమని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. నిరసనలు తీవ్రతరం కావడంతో ఉభయ సభలను నేటికి వాయిదా వేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్ నిరసనల కోసం ప్రణాళికలు రూపొందించడానికి ఇండియా బ్లాక్ ఎంపీలు సమావేశమయ్యారు.

**పార్లమెంట్‌లో ఆందోళన**

అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపీలు సోమవారం కూడా ఆందోళన కొన సాగించారు. రామ మందిరం విరాళాల చోరీతో పాటు విద్యార్థి నిరసనకారుల పట్ల పోలీసుల బలప్రయోగంపై పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం ఎదుట నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, శివదాసన్, ఎస్పీకి చెందిన డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టీఎంసీకి చెందిన మహువా మొయిత్రా, జెఎంఎంకు చెందిన మహువా మాఝీ, ఆర్ఎస్పీకి చెందిన ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ తదితర ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. రామమందిరంలో విరాళాల చోరీకి ప్రతీకగా విరాళాల పెట్టెలను పార్లమెంట్ ఆవరణలో ఉంచారు. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వాటి చుట్టూ బారులు తీరారు. కొందరు ఎంపీలు విరాళాల పెట్టెలో నగదు కూడా వేశారు. అనంతరం విరాళాల ఆదాయం లెక్కింపు సందర్భంగా చోరీ చేయడాన్ని ప్రదర్శించారు.

# బీజేపీకి ఎదురుగాలి

(మొదటిపేజీ తరువాయి)

తొలి రౌండ్ నుంచే బీజేపీపై ఆధిక్యత కనబరుస్తూ వచ్చిన కిషోర్‌కు మొత్తంగా 63,203 ఓట్లు రాగా, సిన్హాకు 44,250 ఓట్లు లభించాయి. ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,085 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ వార్త తెలియగానే జన్ సురాజ్ పార్టీ ప్రధాన కార్యాలయంలో, ఓట్ల లెక్కింపు కేంద్రం వెలుపల సంబురాలు మిన్నంటాయి. పార్టీ అభిమానులు, మద్దతుదారులు డ్యాన్స్‌లు చేస్తూ, మిఠాయిలు పంచుతూ కనిపించారు. మాజీ ఎన్నికల వ్యూహకర్త అయిన కిషోర్ కొన్నేండ్ల క్రితమే పార్టీని స్థాపించారు. మొదటిసారిగా ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. 1995 నుంచి ఈ సీటులో బీజేపీ ఎన్నడూ ఓడిపోలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకిపూర్ సీటుకు ఉప ఎన్నికలు జరిగాయి. జులై 30న ఉప ఎన్నికల్లో 34.30శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 26 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. ఈ అసెంబ్లీ సీటు నుంచి నబిన్ వరుసగా ఐదు సార్లు విజయం సాధించారు. అంతకుముందు ఆయన తండ్రి ప్రాతినిధ్యం వహించారు.

**బీజేపీ నాయకత్వాన్ని బీహార్ ప్రజలు తిరస్కరించారు : ప్రశాంత్ కిషోర్**

బీహార్ ప్రజలు బీజేపీ నాయకత్వాన్ని తిరస్కరించారని ప్రశాంత్ కిషోర్ అన్నారు. గెలుపు అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నిక కేవలం ఒక ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు మాత్రమే జరిగినది కాదన్నారు. బీహార్ నాయకత్వంపై ప్రజలు ఇచ్చిన స్పష్టమైన సందేశమని, బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని తెలిపారు.

నేరపూరిత ధోరణులు, వివాదాస్పద ప్రవర్తన ఉన్న వ్యక్తికి బీజేపీ నాయకత్వాన్ని అప్పగించిందని, ఇలాంటి నాయకత్వాన్ని బీహార్ ప్రజలు అంగీకరించరని చెప్పారు. ప్రజలిచ్చిన తీర్పును బీజేపీ గౌరవంగా స్వీకరిస్తుందని ఆ పార్టీ బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ సరగోయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజా తీర్పు అన్నింటికంటే అతీతమైనదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల్లా రాజ్యాంగ వ్యవస్థలను లేదా ఈవీఎంలను, ఎన్నికల కమిషన్‌ను తాము విమర్శించబోమని అన్నారు.

**మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, గుజరాత్‌లో బీజేపీ అభ్యర్థుల గెలుపు**

మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి ఆశుతోష్ తివారిపై 6,016 ఓట్ల తేడాతో ఘన్‌శ్యామ్ గెలుపొందారు. ఆయనకు 66,757 ఓట్లు పోలయ్యాయి. ఆజాద్ సమాజ్‌పార్టీకి చెందిన దామోదర్ యాదవ్‌కు సుమారు 22 వేల ఓట్లు పోలయ్యాయి. గుజరాత్‌లోని మంజల్‌పుర్ నియోజకవర్గాన్ని బీజేపీ నిల బెట్టుకుంది. వడోదర జిల్లాలో ఉన్న ఆ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ గెలుపొందారు. మాజీ మంత్రి యోగేశ్ పటేల్ జూన్ 2న మృతిచెందడంతో ఆ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. మంజల్‌పుర్ ఎన్నికలో కాంగ్రెస్, బీజేపీ మాత్రమే పోటీలో నిలిచాయి. గతం కంటే బీజేపీకి ఈ ఉపఎన్నికల్లో ఓట్లు తగ్గటం గమనార్హం.

# చక్రవర్తి తన డిగ్రీ చూపిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేసిన దీప్కే కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి నేతృత్వం వహించేందుకు జూన్‌లో భారత్‌కు తిరిగి వచ్చారు. నీట్ పేపర్ లీకేజీపై విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 6వ తేదీన జంతర్ మంతర్ వద్ద ఆయన ఆందోళన ప్రారంభించారు. తొలుత నిరాహార దీక్షగా ప్రారంభమైన ఈ ఉద్యమం దాదాపు రెండు మాసాల వ్యవధిలోనే జాతీయస్థాయిలో ఉద్యమంగా రూపుదిద్దుకున్న సంగతి తెలిసిందే.

**ఏ దర్యాప్తుకైనా సిద్ధమే..**

ప్రభుత్వం తనపై ఏ దర్యాప్తు నిర్వహించాలనుకున్నా అందుకు తాను సిద్ధమేనంటూ దీప్కే ప్రభుత్వాన్ని సవాలు చేశారు. "ఏ వ్యక్తి అయినా ఈ ప్రభుత్వాన్ని సవాలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని వేధించేందుకు ఈడీ, సీబీఐ, ఇతర సంస్థలను పంపిస్తుంది. ఒకవేళ ప్రధాని నా వద్దకు ఈడీని పంపించాలనుకుంటే, ప్రధాని తన డిగ్రీ సర్టిఫికెట్ కాపీని కూడా పంపించాలి. అప్పుడు నేను కూడా నా విద్యా రుణం, స్కాలర్‌షిప్ వివరాలు, డిగ్రీ సర్టిఫికెట్‌ను బహిరంగపరుస్తాను." అని ఆయన ఛత్రపతి శంభాజినగర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

**రాజకీయాలపై ప్రజలకు నమ్మకం పోతోంది**

రాజకీయ పార్టీని ఏర్పాటు చేసే ఉద్దేశం ఉందా అంటూ విలేకర్లు అడిగిన ప్రశ్నపై దీప్కే స్పందిస్తూ, రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు మా కంటే కూడా మీడియా చాలా ఆత్రంగా వుందని వ్యాఖ్యానించారు. "ప్రస్తుతం ఈ దేశంలో వున్న రాజకీయ పార్టీల సంఖ్యను చూసినట్లైతే, మీరు కూడా నిరాశపడి వుంటారని అనిపిస్తోంది. అయినా దీన్ని ఒక సామాజిక ఉద్యమంలా కొనసాగించాలన్నదే మా అభిమతం. దేశంలో ప్రస్తుతమున్న రాజకీయ స్థితిగతులను చూస్తున్నాం కదా, మరో పార్టీని ఏర్పాటు చేసి ఏం లాభం." అని ఆయన వివరించారు. "రాజకీయాల పట్ల ప్రజలకు నమ్మకం కనుమరుగు అవుతోంది. ఉదయానికి ప్రజలు ఒక పార్టీకి ఓటు వేస్తారు. సాయంత్రమయ్యేసరికి మరో పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. ఉదయం ఒకరు ఎంపి లేదా ఎంఎల్‌ఏ అవుతారు, సాయంత్రానికి వారు మరో పార్టీకి మారతారు." అని ఆయన వ్యాఖ్యానించారు. జార్ఖండ్‌లోని విద్యార్థుల ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు వుంటుందని దీప్కే ప్రకటించారు. వారితో తాను మాట్లాడానని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఆ డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు వెనక్కి తగ్గవద్దని వారిని కోరానని చెప్పారు.

## సంపాదకీయం




# 2 లక్షల కోట్లు దాటేస్తున్న జీఎస్టీ

దేశంలో వస్తు సేవల పన్ను సూళ్లు ఇటీవల రూ. 2 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. సాధారణంగా జీఎస్టీ రేట్ల ల్యాండ్‌స్కేప్‌లో సంస్కరణలు, రేట్ల సర్దుబాట్లు చేసిన తర్వాత స్వల్పకాలంలో పన్ను ఆదాయం తగ్గుతుందనే అంచనాలు ఉండేవి. అయితే, అనుకున్నదానికి భిన్నంగా రాబడి ప్రతి నెలా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం దీనిని పన్ను వ్యవస్థలో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనంగా చూపుతున్నప్పటికీ.. నాణేనికి మరోవైపు ఉన్న పన్ను రాబడి స్వభావాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ఆర్థిక సూత్రాల ప్రకారం, జీఎస్టీ అనేది అడ్ వలోరమ్ పన్ను. అంటే, ఇది ఒక వస్తువు లేదా సేవ తుది విక్రయ ధరపై శాతంగా లెక్కిస్తారు. అంటే ఓ వస్తువు ధర వంద రుపాయలు అయితే దానిపై ట్యాక్స్ 18 శాతం అయితే .. పద్దెనిమిది రూపాయల ట్యాక్స్ కట్టాలి. మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరిగినప్పుడు పన్ను శాతం మారకపోయినప్పటికీ, ప్రభుత్వానికి వచే పన్ను మొత్తం ఆటోమేటిక్‌గా పెరుగుతుంది. ఉదాహరణకు, రూ. 100 విలువైన వస్తువుపై 18% జీఎస్టీ పడితే ప్రభుత్వానికి రూ. 18 వస్తుంది. కానీ ద్రవ్యోల్బణం వల్ల అదే వస్తువు ధర రూ. 150కి పెరిగితే, అదే 18శాతం చొప్పున ప్రభుత్వానికి రూ. 27 పన్ను సమకూరుతుంది. అంటే వ్యాపారం లేదా వస్తువుల వినియోగ పరిమాణం పెరగకపోయినా, కేవలం ధరల పెరుగుదల వల్ల కూడా పన్ను వసూళు గణనీయంగా పెరుగుతాయి.ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సంరక్షణాత్మక వాణిజ్య విధానాలు, సుంకాల యుద్ధాలు, గ్లోబల్ సప్లై చైన్ సమస్యల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు, సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని ప్రభావం భారతీయ మార్కెట్‌పై కూడా పడి నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్, ముడిసరుకుల ధరలు పెరగడానికి దారితీసింది. ఆసియా, ఐరోపా మార్కెట్లలో రేగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వ్యాపార వ్యయాన్ని పెంచడంతో.. ఆ భారం అంతిమంగా వినియోగదారుడిపై పడింది. ధరలు పెరగడం వల్ల ప్రజల జేబుల నుంచి ఎక్కువ సొమ్ము పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది.కేవలం రూ. 2 లక్షల కోట్ల జీఎస్టీ రికార్డు కలెక్షన్లను మాత్రమే చూసి దేశంలో ప్రగతి ఉప్పొంగిపోతోందని తీర్మానించడం సమగ్రమైన విశ్లేషణ కాదు. ఈ రాబడిలో ఎంత భాగం నిజమైన ఆర్థిక వృద్ధి ద్వారా వచ్చింది, ఎంత భాగం ద్రవ్యోల్బణం వల్ల పెరిగిందో వేరు చేసి చూడాలి. ఒకవైపు ధరల భారంతో సామాన్య ప్రజల కొనుగోలు శక్తిపై ప్రభావం పడుతుంటే, మరోవైపు అదే ధరల పెరుగుదల ప్రభుత్వానికి రికార్డు రాబడిని తెచ్చిపెడుతోంది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ.29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది.దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్-ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించిందిపన్ను సంస్కరణలతో పాటు పన్ను నిఘా పెరగడం సానుకూలాంశమే అయినప్పటికీ, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల వల్ల పెరుగుతున్న పన్ను భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించే చర్యలపై దృష్టి సారించడమే నిజమైన ఆర్థిక నిర్వహణ అవుతుంది

# జెన్ జీ టచ్‌లో జనసేన




**కాకినాడ- సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారు తున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసం హరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు ఎంతగానో ఉపయో గపడతాయని పార్టీ భావిస్తోంది.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ వస్తున్నారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుత జెన్ జీ ట్రెండ్‌కి తగినట్లుగా పోరాటాలకు సిద్ధంగా ఉండే నాయకత్వాన్ని తయారు చేయాలని కోరుకుంటున్నారు. కొత్త తరపు గొంతుక పార్టీలో స్పష్టంగా వినిపించాలనే లక్ష్యంతో ఈసారి మరింత ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డ ఆయన కొత్త కమిటీల నియామకం పై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. ఈసారి కేవలం రాజకీయ నాయకులే కాకుండా చదువుకున్న విద్యాధికులతో పాటు ఐటీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు పంపాలని చూస్తున్నారు. వచ్చే నెలలో ఈ కొత్త కమిటీల పూర్తి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ భవిష్యత్తును మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి.దేశ రాజకీయాలను ఇటీవల కాలంలో జెన్ జీ తరహా ఉద్యమాలు ఒక కుదుపు కుదిపేశాయి. ఆ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీలో యువతతో పాటు చదువుకున్న టెక్కీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని సమాచారం అందుతోంది. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులు, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న యువ నాయకులను ప్రోత్సహించి కీలక బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడమే ఈ కొత్త కమిటీల ప్రత్యేకతగా నిలవనుంది. కేవలం సాంప్రదాయ ధోరణులకు పరిమితం కాకుండా నేటి డిజిటల్ యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరుకుంటున్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని, రాబోయే ఎన్నికలలో ఇది పార్టీ విజయానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అంతా భావిస్తున్నారు.మార్పు అనేది ఎప్పుడూ ఒక మంచి పరిణామం అని నమ్మే పవన్ కళ్యాణ్, జనసేన పార్టీలో చేస్తున్న ఈ ప్రక్షాళన భవిష్యత్తు రాజకీయాలకు ఒక దిక్సూచి కానుంది. టెక్నాలజీ యుగంలో దూసుకుపోతున్న నేటి తరానికి తగినట్లుగా పార్టీ యంత్రాంగాన్ని సంస్కరించడం ద్వారా సమాజంలో సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ల మార్గదర్శకత్వంలోనే ఉంటూనే, నిర్ణయాలు తీసుకునే అధికారంలో యువతకు పెద్దపీట వేయడం ఈ కొత్త కమిటీల ప్రధాన ఉద్దేశం.

రాబోయే కాలంలో జరగబోయే ప్రతి ఎన్నికను సవాల్‌గా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జనసేన శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. త్వరలో ప్రకటించబోయే కొత్త రాష్ట్ర కమిటీ జాబితా రాజకీయ వర్గాలలో పెను మార్పులకు కారణం కానుంది. పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాలు పార్టీని ఏ విధంగా విజయతీరాలకు చేర్చుతాయనేది వేచి చూడాలి. ఏది ఏమైనా ఈ నిర్ణయం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# రేవంత్ బాటలో డీకే...



**బెంగళూరు-సూర్య వాస్తవం :** ఎన్నికల సమయంలో వేసే రాజకీయ ఎత్తుగడలు, విమర్శలు వేరని.. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలన విషయానికి వచ్చేసరికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడమే నిజమైన రాజధర్మమని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నిరూపించారు. శనివారం మైసూరులోని రామకృష్ణ విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక వివేకనంద స్మారక యత్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీతో వేదిక పంచుకున్న డికేఎస్, సభాముఖంగా ప్రధానిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి."మా ప్రధాని మోదీ ఈ చారిత్రాత్మక వేడుకకు రావడం చాలా గర్వకారణం" అని కొనియాడారు. "రాష్ట్ర అభివృద్ధి విషయంలో మొత్తం కర్ణాటక మీతో నిలబడుతుంది. మనం అంతా కలిసి పనిచేద్దాం. కర్ణాటక అభివృద్ధి చెందితేనే దేశం కూడా వృద్ధి చెందుతుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కర్ణాటకకు విశాల హృదయంతో సహాయం అందించి, ఆదుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, తనకు మాట్లా డేందుకు కేవలం ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉందని, ప్రధాని మోదీ దేశ ప్రజలకు ఇచ్చే సందేశం చాలా కీలకమైనదని, కాబట్టి తన సమయాన్ని వృథా చేయబోనంటూ ఆయన వేదికపై గౌరవప్రదంగా ప్రసంగాన్ని ముగించడం, ఆ తర్వాత ప్రధాని మోదీ ? డికేఎస్ ఒకరి చేయి ఒకరు పట్టుకుని ఆప్యాయంగా నడుచుకుంటూ వెళ్లడం విడియాలో హైలైట్ అయ్యింది.రాజకీయాల్లో సైద్ధాంతిక విభేదాలు, విమర్శలు సహజమే అయినప్పటికీ, అధికారంలోకి వచ్చాక కేంద్రంతో వైరం పెట్టుకుంటే నిధుల కేటా యింపులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతిని చివరికి రాష్ట్రానికే తీవ్ర నష్టం జరుగుతుందనే పచ్చి నిజాన్ని డి.కె. శివకుమార్ గుర్తించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కేంద్రంతో సత్సంబంధాలు నెరపుతూ రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చుకోవడమే ఉత్తమ మార్గమని ఆయన భావించారు. రాజకీయ వేదికలపై ప్రత్యర్థులుగా పోరాడినా, పాలనా వ్యవస్థలోకి రాజకీయాలను తీసుకురాకూడదనే ఒక స్పష్టమైన దృక్పథాన్ని ఈ పరిణామం ద్వారా ఆయన చాటిచెప్పారు.సరిగ్గా ఇదే తరహా పరిణతి కూడిన వ్యూహంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా మొదటి నుంచి పయనిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, రాష్ట్ర ప్రగతి , మెట్రో విస్తరణ, మసీ పునరుజ్జీవనం, బడ్జెట్ నిధుల కోసం ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను పలుమార్లు కలసి వినతులు అందించారు. కేంద్రంతో మేము యుద్ధం చేయం.. రచ్చ చేయం.. కలసి పనిచేసి రాష్ట్రానికి రావాల్సిన హక్కులను సాధించుకుంటాం అనే ముక్కుసూటి పాలసీని రేవంత్ పాటించారు. ఇప్పుడు కర్ణాటకలో డి.కె. శివకుమార్ కూడా అదే రేవంత్ మోడల్‌ను అనుసరిస్తూ, పరిపాలనకు-రాజకీయాలకు మధ్య గీత గీసి ముందుకు సాగడం దక్షిణాది కాంగ్రెస్ పాలనలో సరికొత్త రాజకీయ సంస్కృతికి అద్దం పడుతోంది.

# పరారీలో వైసీపీ నేతలు

**ఏలూరు, గుంటూరు-సూర్య వాస్తవం :**

ఆంధ్రప్రదేశ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలలో కనిపిస్తున్న భయం, ఆందోళన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చెలరేగి పోయి కేసులు మూటగట్టుకున్న నాయకులు.. ఇప్పుడు విచారణను ఎదుర్కొనే ధైర్యం లేక చాంతాడంత పొడవునా పరారీలో ఉంటున్నారు. ఎక్కువ మంది కొత్త కేసుల్లోనే ఇరుక్కుంటున్నారు. కనిపించకుండా పోతున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వ రరావుకు మద్యం రవాణా టెండర్ల అక్రమాల కేసులో సుప్రీంకోర్టు నుంచి ముందస్తు బెయిల్ రాక తీవ్ర షాక్ తగలడం, చింతాడ రవికుమార్, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వంటి వారు ఎక్కడ ఉన్నారో తెలియక అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఈ సిరీస్‌లో తాజా పరిణామాలు. తమ్మినేని వంటి కొందరు నేతలు అత్యంత ప్రయాస పడి మధ్యంతర బెయిల్ తెచ్చుకుంటుంటే.. మిగిలిన వారంతా పోలీసుల భయంతో దిక్కుతోచని స్థితిలో నక్కి నక్కి బతుకుతున్నారు.అసలు ఇక్కడ విచిత్రమేమిటంటే.. పోలీసులు వీరిని అరెస్ట్ చేయడానికి పెద్దగా ప్రత్యేక వేట ఏమీ సాగించడం లేదు.

అయినప్పటికీ, తమ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోనన్న భయంతో ఫోన్లు కూడా వాడకుండా, రహస్య స్థావరాల్లో దాక్కుంటూ నేతలే సొంతంగా నరకం అను భవిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నిందితులు ఎంతకాలం పారిపోగలరు? ఎక్కడో ఒకచోట ఫోన్ వాడినా, డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసినా లేదా మూడో వ్యక్తితో మాట్లాడినా పోలీసులు సులభంగా ట్రాప్ చేయగలరు. పోలీసులకు పట్టుబడకుండా శాశ్వతంగా తప్పించుకోవడం అసాధ్యమనే విషయాన్ని గుర్తించకుండా, కోర్టులు ముందస్తు బెయిల్ ఇచ్చే వరకు అజ్ఞాతంలో ఉంటామనడం కేవలం స్వయంకృతాపరాధమే.నిజానికి చట్టాన్ని గౌరవించి ధైర్యంగా వెళ్లి పోలీసుల ముందు లొంగిపోతే .. మహా అయితే రిమాండ్‌కు పంపి జైలులో పెడతారు. కేసు తీవ్రతను బట్టి వారం లేదా పది రోజుల్లో సాధారణ బెయిల్ వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఆ చట్టపరమైన మార్గాన్ని వదిలేసి, రోజూ అరెస్ట్ అవుతామేమోనన్న భయంతో ముళ్ల కంచె మీద గుడ్డ వేసుకున్నట్లు పరారీలో రోజులు గడపడం వ్యూహాత్మకంగా పెద్ద పొరపాటు.

ఒకవైపు సుప్రీంకోర్టు కూడా తీవ్రమైన ఆరోపణలు, ఆర్థిక నేరాలు ఉన్న కేసుల్లో కస్టడీ విచారణ అవసరమని స్పష్టం చేస్తూ ముందస్తు బెయిళ్లను తిరస్కరిస్తోంది. ఈ పరిణామాలైనా వైసీపీ నేతలకు కళ్లు తెర్పించాలి. గతం చేసిన తప్పులకు భయపడి అడవుల్లోనో, పక్క రాష్ట్రాల్లోనో నక్కి నక్కి బతికే కన్నా.. చట్టం ముందు హాజరై, లొంగిపోయి న్యాయపోరాటం చేయడమే రాజకీయ నాయకులకు, వారి భవిష్యత్తుకు శ్రేయస్కరం. అది వారు అర్థం చేసుకోలేకపోతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ ఓ. ఆనంద్

- ప్రతి అర్జీని వ్యక్తిగతంగా పరిశీలించాలని జిల్లా అధికారులకు ఆదేశం
- అర్జీదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచన
- ప్రజల వినతులపై సత్వర చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక--రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని సంబంధిత శాఖల జిల్లా అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించాలని సూచించారు. అర్జీదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు అధికా రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి వినతిపత్రంపై బాధ్యతాయుతంగా స్పందించి, నిర్ణీత గడువులోగా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేసి, ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు.

# వరుణ దేవుడా కరుణించవా

- గంగను విడువు పరమేశ్వర అంటూ బొడ్రాయికి భక్తులు నూట ఒక్క కొబ్బరి కాయలు 101 బిందెలతో జలాభిషేకం



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి బొడ్రాయి దగ్గర వర్షం కోసం రైతాంగం తపిస్తూ వరుణ్ దేవుడా కరుణించి ఎండిపోతున్న పంట పొలాలను బ్రతికించవాని సోమవారం భక్తిశ్రద్ధలతో నిష్టాగ్రస్టులై మహిళారైతులు బొడ్రాయికి 101 నిండు బిందెల నీరు పోసి 101 కొబ్బరికాయలు సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సింగల్ విండో అధ్యక్షుడు, సీనియర్ టిడిపి నాయకులు బోల్లు.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జూన్ వాసంలో కురిసిన తడిపూడి వర్షానికి సకాలంలో వర్షం వచ్చిందని రైతులు ఎంతో ఆశతో పంటలు సాగు చేశారని, దాదాపు 50 రోజులు గడుస్తున్న వర్షం రానందున మొలచిన పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. మండల వ్యాప్తంగా వర్షం కోసం రైతులందరూ తపిస్తున్నారని, వరుణ దేవుని కోసం విరాట పారాయణం, భగవద్గీత, ముర్రో వానదేవుడా అంటూ 5,9 ఊర్ల భజనలు, హరికథలు, కప్పలపెండ్లిల్లు, గాడుదుల పెండ్లిల్లు, దేవాలయాల్లో పండరిభజనలు,పౌరాణిక నాటక ప్రదర్శనలు, దేవాలయాల్లో అక్కడ దీపారాధనలు, లాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారని, వారం లోపల వర్షం రాకపోతే పంట పొలాలు గల్లంతే అన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు శర్మ బొల్లు.శ్రీనివాసులురెడ్డి, కొండూరు రఘునాథ్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, పురో హితులు మధుశర్మ, రంగనాయకులు, కుమార్, నాగరాజు, వెంకట్రాముడు, అయ్యప్ప, కేశవాచారి తదితర రైతులు పాల్గొన్నారు.

# నగరంలో మహిళలకు ప్రత్యేక పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌కు సీజేపీ నాయకుల వినతి

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారికి ప్రత్యేకంగా పరిశుభ్రమైన పబ్లిక్ టాయిలెట్లను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని సిటిజన్స్ జస్టిస్ పార్టీ (సీజేపీ) నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీజేపీ నాయకులు మాట్లాడుతూ, నగరంలోని ప్రధాన రహదారులు, రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతాలు, బస్టాండ్లు, వాణిజ్య సముదాయాలు, ప్రజా రద్దీ అధికంగా ఉండే ఇతర ప్రాంతాల్లో మహిళలకు ప్రత్యేక పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటు అత్యవసరమని పేర్కొన్నారు.మహిళల ఆరోగ్యం, భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తూ పరిశుభ్రమైన, సురక్షితమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఇప్పటికే నగరంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు, వాటికి తగిన నిర్వహణ చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. నగరంలో మహిళలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాల కల్పనపై నగర పాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించి, మహిళా పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.




- మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి అరెస్ట్
- వెల్పుమడుగు భూవివాదంపై ధర్నాకు పిలుపు..
- వైసీపీ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- శాంతిభద్రతల దృష్ట్యా ధర్నాకు అనుమతి లేదన్న పోలీసులు
- ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లకుండా వైసీపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు

# ఉరవకొండలో ఉద్రిక్తత..



**ఉరవకొండ - సూర్య వాస్తవం :**విడపనకల్లు మండలం వెల్పుమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు కురవ గోవింద్‌కు సంబంధించిన 21 ఎకరాల భూమిపై వివాదం నేపథ్యంలో ఉరవకొండలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ భూమి ఆలయానికి సంబంధించినదని టీడీపీ, బీజేపీ నేతలు ఆరోపిస్తుండగా, అది ప్రైవేటు భూమి అని రెవెన్యూ అధికారుల ధ్రువీకరణ, జిల్లా కలెక్టర్ ఎండార్స్‌మెంట్, కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని వైఎస్సార్సీపీ నాయకులు పేర్కొన్నారు.ఈ అంశంపై నిరసనగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి ధర్నాకు పిలుపునిచ్చారు. అయితే గుంతకల్ సబ్‌డివిజన్ పరిధిలో ఎటువంటి ధర్నాలు, నిరసన కార్యక్రమాలకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఉరవకొండలోని వైఎస్సార్సీపీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు పలువురు నాయకులు, కార్యకర్తలను అడ్డుకున్నారు.జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న మాట్లాడుతూ, తాము శాంతియుతంగా ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి గ్రీవెన్స్ డే సందర్భంగా వెల్పుమడుగు భూవివాదంతో పాటు ఇతర సమస్యలపై వినతిపత్రం అందజేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అయితే వైసీపీ కార్యకర్తలను పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నారని ఆరోపించారు.అయినప్పటికీ వందలాది మంది కార్యకర్తలు ఉరవకొండకు తరలివచ్చారని, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి నేతృత్వంలో ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించామని చెప్పారు. ఒకేరోజు వివిధ రాజకీయ పార్టీలు ధర్నాలకు పిలుపునివ్వడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని పోలీసులు తమకు తెలిపారని పేర్కొన్నారు. భద్రతా కారణాలను చూపుతూ తమను అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేశారని సీపీ వీరన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వైఎస్సార్సీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, “ఇది ప్రజాస్వామ్యమా? ఇలా దౌర్జన్యంగా అరెస్టు చేసి తీసుకెళ్లడం ఏమిటి?” అని ప్రశ్నించారు. పోలీసులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.వైఎస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడంతో ఉరవకొండలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



# పీజీఆర్ఎస్‌లో 102 వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

- ప్రజా సమస్యలకు చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కారం చూపడమే లక్ష్యం
- ఫిర్యాదుదారులకు విచారణ పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం
- చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమన్న జిల్లా ఎస్పీ





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్, ప్రజల నుంచి మొత్తం 102 పిటిషన్లు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను ఆశ్రయిస్తున్న నేపథ్యంలో, ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కారం చూపడమే లక్ష్యమని తెలిపారు.స్వీకరించిన పిటిషన్లను సంబంధిత పోలీస్ అధికారులకు పంపించి, వెంటనే విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు వారి పిటిషన్ల విచారణ పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన పిటిషనర్లు, వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ సహకారంతో ఉచిత భోజన సదుపాయం కల్పించారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అండ్ టిడిపి శింగనమల నియోజకవర్గ పరిశీలకులు



**గార్లదిన్నె - సూర్య వాస్తవం :**శింగనమల నియోజకవర్గం, నార్పల్ మండలం, దుర్గం గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిగా హాజరైన శింగనమల నియోజకవర్గ పరిశీలకులు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు నరసా నాయుడు ఈ సందర్భంగా సీడ్స్ ఛైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు వస్తున్నాయని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొకటి గా దాదాపు నేరవేస్తుందని, కూటమి ప్రభుత్వం పై ప్రజలలో మరింత విశ్వాసం పెంచిందని అన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, ఇంట్లో ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద రూ.15000, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏటా రూ. 20,000 ఇలా ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని. అంతేకాకుండా భవిష్యత్తులో అనేక అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జన్మదిన వేడుకలు






**గార్లదిన్నె - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్ఎస్ గ్రామంలో సామల మధు ఆధ్వర్యంలో సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సామల మధు మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమం లో సామల రాజన్న,సామల రామాంజనేయులు, సామల మధు,కే.రామంజి ఆచారి, మజారి నాగేంద్ర, చిట్టి నలప రెడ్డి, కే .ఆంజనేయులు, కృష్ణమూర్తి, పెద్దన్న, తరుణ్ కుమార్ ఆచారి, బెల్లం రామంజి, అరవ పవన్, సాయి ప్రభాస్, లాడెన్ సురేష్,నాగేంద్ర, శర్మ, సీనా, యూత్ కిరణ్, రఘు, ధను, కృష్ణ, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కమిషనర్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ చౌక్ దగ్గర వున్నా ఆర్‌డబి అతిథి గృహంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు వడ్డిస్తున్న ఆహారాన్ని రుచి చూసి నాణ్యతను తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు స్వయాన ఆహారాన్ని వడ్డించారు. క్యాంటీన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.

# ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తప్పవు: గుత్తి ఎంఈవో



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో ప్రభుత్వ నిబంధన లు పాటించని ప్రైవేటు పాఠశాలల పై చర్యలు తప్పవని ఎంఈఓ రవి నాయక్ తెలిపారు.గుత్తి పట్టణంలో సమయపాలన పాటించకుండా సా యంత్రం వేల ట్యూషన్ల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు.అలా చేస్తే అటువంటి పాఠశాలలపై చర్యలు తప్పవని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు తప్పకుండా సమయపాలనతో, పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడపాలన్నారు.



## కలెక్టర్ సార్ మా గ్రామానికి
## స్కూలు ఏర్పాటు చేయరా..?

- ఎమ్మార్వోకి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు
- ప్రభుత్వ పాఠశాల లేనందున చదువులు మానేసిన చిన్నారులు
- అక్షరాసులు నిరక్షరాసులుగా మారుతున్న వైనం

**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి మండలంలోని గజరాంపల్లిలో ప్రభుత్వ పాఠశాలభవనం లేనందున పలువురు విద్యా ర్థులు చదువులు మానేసి నిరక్షరాసులుగా జీవిస్తున్నారని గజరాంపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 100శాతం అక్షరాస్యత సాధిద్దాం అనే ప్రభు త్వం నినాదానికి మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు తూట్లు పొడుస్తున్నారని, ప్రభుత్వపాఠశాల భవనం లేక గ్రామ సచివాలయంలో తాత్కాలికంగా ప్రాథమిక విద్య తరగతులు నిర్వహిస్తున్నారు. అందులో మౌలిక సదుపాయాలు లేనందున కొందరు పామిడి, మిడుతూరు గ్రామాల్లోని ప్రైవేటు పాఠశాలలకు చిన్నారులు పోతున్నారని, అక్కడ ఫీజులు భరించలేక మరికొంతమంది చదువులు మానేస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. పాఠశాల భవనం లేక దాదాపు 15 సంవత్సరములు అవుతున్నదని ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి మా గ్రామం చిన్నారులు నిరక్షరాసులు (డ్రాబోడ్సు) కాకుడా కాపాడవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకొని ప్రభుత్వభవన నిర్మాణం పూర్తి చేసి యదాస్థితిగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగించాలని, లేనిఎడల ధర్నాలు ముట్టడి నిరాహారదీక్షలు రాస్తారోకోలు ఆమరణ నిరాహారదీక్షలు లాంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.తదుపరి మండల రెవెన్యూశాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నందు తహసిల్దార్ షర్మిలాకు వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసనలు తెలిపారు.



# దేవుడా నేనేమి చేశాను నేరం..?

- ఆలయం సమీపంలో అనాథగా.. అప్పుడే పుట్టిన మగశిశువు
- పెనుకొండలో కలకలం..
- శిశువు ఏడుపుతో అప్రమత్తమైన స్థానికులు.. అధికారులకు సమాచారం
- అనాథ శిశువుకు అండగా ఐసీడీఎస్..
- నవజాత శిశు సంరక్షణ కేంద్రానికి తరలింపు

**అనంతపురం ప్రతినిధి- సూర్య వాస్తవం :** పెనుకొండ మండలం కియా పోలీస్ స్టేషన్ వెనుక భాగంలోని మునిమడుగు పంచాయతీ పరిధిలోని నరసింహస్వామి ఆలయం సమీపంలో అప్పుడే పుట్టిన ఓ మగశిశువు కనిపించడం కలకలం రేపింది. సోమవారం ఉదయం శిశువు ఏడుపు వినిపించడంతో స్థానికులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అప్పుడే జన్మించిన శిశువును అక్కడ వదిలి వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, శిశువును అక్కడ వదిలివెళ్లిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై ఐసీడీఎస్ శ్రీ సత్యసాయి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల స్పందిస్తూ, శిశువును అధికారుల సంరక్షణలోకి తీసుకుని



అనంతపురంలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన అనంతరం, నిబంధనల ప్రకారం శిశుగృహానికి తరలించే చర్యలు చేపడతామని వెల్లడించారు.

**పిల్లలు లేని దంపతుల ఆవేదనను అర్థం చేసుకుందాం...**

వివాహం జరిగి ఎన్నో సంవత్సరాలు గడిచినా పిల్లలు లేకపోవడంతో కొందరు భార్యాభర్తలు తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారు. సమాజంలో చుట్టుపక్కల వారు, బంధువులు “పిల్లలు లేరా?” అంటూ చేసే సూటిపోటి వ్యాఖ్యలు వారి బాధను మరింత పెంచుతున్నాయి. అలాంటి సమయంలో కొందరు తల్లులు తమ బిడ్డలను రోడ్డుపక్కన, చెత్త డబ్బాల వద్ద, ఊరి చివర లేదా ఆలయాల సమీపంలో వదిలివెళ్లడం ఎంతో బాధాకరం.

ఒక బిడ్డ కోసం ఎన్నో దంపతులు ఆశతో ఎదురుచూస్తున్నారనే విషయాన్ని ఒక్కసారి ఆలోచించండి. పిల్లలను వదిలివేయడం సమస్యకు పరిష్కారం కాదు. ఆ బిడ్డకు సురక్షితమైన భవిష్యత్తు కల్పించే చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయి. తల్లి లేదా కుటుంబం ఏదైనా క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పుడు, బిడ్డను ప్రమాదంలో వదిలేయకుండా సంబంధిత అధికారులను లేదా బాలల సంక్షేమ వ్యవస్థను సంప్రదించడం బాధ్యతాయుతమైన నిర్ణయం.

ప్రతి బిడ్డకు ప్రేమగా జీవించే హక్కు ఉంది...
ప్రతి తల్లిదండ్రుల ఆవేదనకు సమాజం గౌరవం ఇవ్వాలి...
- బాధపెట్టే మాటలు కాదు... అర్థం చేసుకునే మనసు కావాలి.

# పాత బాకీ రూ.6 వేల కోసం హత్య..

- నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష
- రూ.1,000 జరిమానా విధించిన అనంతపురం 7వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు
- మహాత్మా గాంధీ షెల్టర్‌లో జరిగిన హత్య కేసులో సంచలన తీర్పు




**అనంతపురం క్రైమ్- సూర్య వాస్తవం :** పాత బాకీ రూ.6 వేలు తిరిగి ఇవ్వలేదనే కారణంతో ఓ వ్యక్తిని రోకలి కర్రతో కొట్టి హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం ఏడవ అదనపు జిల్లా సెషన్స్ అండ్ ఫ్యామిలీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి సి.ఎన్. మూర్తి సోమవారం తీర్పు చెప్పారు.

**ఘటన వివరాలు**

శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాసులు (41), అశోక్‌లు అనంతపురంలోని కొవ్వూరు నగర్‌లో ఉన్న మహాత్మా గాంధీ షెల్టర్‌లో నివాసం ఉండేవారు.2022 జూన్ 25న మధ్యాహ్నం సుమారు 1:45 గంటల సమయంలో అశోక్ భోజనం చేస్తుండగా, తనకు రావాల్సిన రూ.6 వేల నగదును తిరిగి ఇవ్వాలని శ్రీనివాసులు అడిగాడు. అయితే, అశోక్ “డబ్బులు ఇవ్వను... ఏం చేసుకుంటావో చేసుకో” అంటూ ఎదురు చెప్పడంతో శ్రీనివాసులు ఆగ్రహానికి గురయ్యాడు. ఈ క్రమంలో రోకలి కర్రతో అశోక్ తలపై తీవ్రంగా కొట్టాడు. దీంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు.

**విచారణలో నేరం రుజువు**

ఈ ఘటనపై షెల్టర్ యజమాని లక్ష్మీకాంత్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి అనంతపురం సీఐ జాకీర్ హుస్సేన్ కేసు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 156/2022 కింద ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం కేసు నమోదు చేసి, విచారణ అనంతరం కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.ఎస్సీ నంబర్ 261/2022 ప్రకారం విచారణ చేపట్టిన న్యాయస్థానం మొత్తం 10 మంది సాక్షులను విచారించింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది.

**పబ్లిక్ ప్రాసిక్యూటర్ బలమైన వాదనలు**

ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బుడన్ సాహెబ్ బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను సమర్థవంతంగా న్యాయస్థానం ముందుంచి నిందితుడికి శిక్ష పడేలా కీలక పాత్ర పోషించారు.

**పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు**

జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు సీఎంఎస్ సీఐ యు.వలిబాషా, అనంతపురం 4వ పట్టణ సీఐ ఎ.పి. మస్తాన్ పర్యవేక్షణలో కోర్టు విభాగానికి చెందిన ఏఎస్ఐ సునీల్ కుమార్, పీసీ కుల్లాయప్పలు సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరు పరిచారు.కేసు విచారణలో సమర్థవంతంగా వ్యవహరించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# టిడిపి పాపాలు పరాకాష్టకు చేరుకున్నాయి

- వైసీపీ నేతల ఆరోపణ
- ఉరవకొండలో పోలీసు రాజ్యం నడుస్తోందని విమర్శ
- వైసీపీ జెండా చూస్తే మంత్రి పయ్యావుల కేశవ్‌కు వణుకు పుడుతోందని వ్యాఖ్య

**ఉరవకొండ - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలోనే ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఏర్పడ్డాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ ఆరోపించారు.ఉరవకొండ నియోజకవర్గంలో మంత్రి పయ్యావుల కేశవ్ కనుసన్నల్లో పేకాట క్లబ్బులు, బెల్ట్ షాపులు, భూ ఆక్రమణలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా వైసీపీ శాంతియుతంగా ధర్నా నిర్వహించేందుకు ప్రయత్నించగా, పోటీ ధర్నాల పేరుతో అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు.ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ ధర్నాను వాయిదా వేసుకున్నప్పటికీ, అనంతరం కూడా అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు.గ్రీవెన్స్ డే సందర్భంగా ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేయడానికి వస్తున్న వైసీపీ కార్యకర్తలను పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నారని ఆరోపించారు. అయినప్పటికీ వందలాది మంది కార్యకర్తలు తరలిరాగా, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి ఎమ్మార్వో కార్యాలయానికి బయలుదేరిన సమయంలో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారని తెలిపారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేలో ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియ జేయకుండా అడ్డుకోవడం



ద్వారా ప్రభుత్వమే ఆ కార్యక్రమాన్ని అగౌరవపరిచిందని విమర్శించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి, టిడిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని గుంతకల్లు డీఎస్పీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కె.వి. రమణ మాట్లాడుతూ, “నిర్బంధం ఎక్కడ ఉంటుందో తిరుగుబాటు అక్కడే ఉంటుంది” అని అన్నారు. పోలీసుల ఆంక్షలను ఎదుర్కొంటూ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వైసీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారని తెలిపారు. వైసీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డిని కలిసిన కార్యకర్తలను అక్కడే నిర్బంధించి అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఆరోపించారు.ఇటీవల శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో జరిగిన ఘటనలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కేసు నమోదు చేసి జైలుకు పంపారని, అలాగే కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యేపై దాడి చేసి, అనంతరం ఆయనపైనే కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఈ ఘటనల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని విమర్శించారు.మహా భారతంలో శ్రీకృష్ణుడు శిశుపాలుడి తప్పులను కొంతకాలం సహించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, చంద్రబాబు ప్రభుత్వం కూడా చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు.తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లోనూ వైసీపీ కార్యకర్తలు వెనుకడుగు వేయకుండా పోరాటం కొనసాగించడం అభినందనీయమని అన్నారు. ఉరవకొండలో వైసీపీ జెండా కనిపిస్తేనే మంత్రి పయ్యావుల కేశవ్ భయపడుతున్నారనేందుకు ఈరోజు జరిగిన ఘటనలే నిదర్శనమని ఆరోపించారు.నేరాలకు పాల్పడుతున్న వారికి రక్షణ కల్పిస్తూ, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కఠినంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి హానికరమని విమర్శించారు. ప్రభుత్వాలు శాశ్వతం కావని, వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేయాలని సూచించారు. లేకుంటే భవిష్యత్తులో అదే వ్యవస్థలు అధికారులకు సమస్యగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఉద్దేశించి, అప్పులు చేసి కొనుగోలు చేసిన పేద రైతు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించడం న్యాయమా అని ప్రశ్నించారు. సంబంధిత భూమి దేవాలయ భూమి కాదని కలెక్టర్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారని, కోర్టు ఇంజక్షన్ ఉన్నప్పటికీ రైతును పొలంలోకి వెళ్లనీయకుండా టిడిపి అనుచరులు అడ్డుకుంటు న్నారని ఆరోపించారు. వారికి పోలీసులు రక్షణ కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ప్రభుత్వాలు మారుతా యని, భవిష్యత్తులో న్యాయస్థానాల ముందు సమాధానం చెప్పాల్సిన పరిస్థితులు రావచ్చని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని పాటిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, లేకుంటే ప్రజా పోరాటాలు మరింత ఉధృతమవుతాయని పేర్కొన్నారు.

ఈ పోరాటంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

వై. విశ్వేశ్వర్ రెడ్డి, రమేష్ గౌడ్, మీసాల రంగన్న, సీపీ వీరన్న, అశోక్ రాకెట్ల, నరసింహులు ఎంపీపీ, దేవి ఎంపీపీ, బెలుగుప్ప వైసీపీ అధ్యక్షుడు మచ్చన్న, విడపనకల్ వైసీపీ అధ్యక్షుడు రమేష్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సుశీలమ్మ, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, పంచాయతీరాజ్ విభాగం నాయకుడు బసవరాజ్, ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్, వైఎస్ఆర్టీయూసీ నాయకుడు నరేష్, కురుబ గోవిందు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లి దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## పొలాలకు పోవు దారి ఆక్రమణ...

### - తహశీల్దార్‌కు అర్జీ ద్వారా ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీటీసీ ఉదయ్, మాజీ సర్పంచి కృష్ణమూర్తి



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** మండల పరిధిలోని ఏకొల్లు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఉదయ్ మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి ఆ గ్రామానికి చెందిన రైతులు కలిసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే)లో పొలాలకు పోవు దారిని ఆక్రమించారని తహశీల్దార్ రాజేంద్రకు అర్జీని అందజేశారు. వివరాల మేరకు ఏకొల్లు గ్రామం నుండి పాల కాలువ ద్వారా పంట పొలాలకు పోవు దారిని కొందరు ఆక్రమణదారులు ఆక్రమించారని అందువలన పంట పొలాల్లోకి పోవాలంటే పలు ఇబ్బందులు పడుతున్నామని రైతులు తాసిల్దార్ రాజేంద్ర కు తెలియజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఆక్రమణకు గురైన పంట పొలాలకు పోవు దారిని పరిశీలించి దారిని ఎవరైనా ఆక్రమించి ఉంటే అట్టి వారిపై చర్యలు తీసుకొని. పొలాలకు పోవు దారిని ఏర్పాటు చేయడం జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు.

## ప్రతి గ్రామంలోని తాగునీటి వనరులు పరీక్షలు నిర్వహించాలి

### - "ఎంపీడీవో గోవర్ధన్ "



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** తాగు నీటి ద్వారా సంభవించే పలు వ్యాధులను కట్టడి చేసేందుకు ముందు జాగ్రత్తగా చర్యలుగా ప్రతి గ్రామంలోని తాగునీటి వనరులను తప్పనిసరిగా నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఎంపీడీవో గోవర్ధన్ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్ డబ్ల్యూ ఎస్,ఏ. ఈ,ఉమామహేశ్వరి పర్యవేక్షణలో సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సహాయకులకు పరీక్షా కిట్ లను పంపిణీ చేశారు. వాటిని ఉపయోగించే విధానం ఏ ఈ ఉమామహేశ్వరి వివరించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రజలు కలుషిత నీరు త్రాగి వ్యాధుల బారిన పడకముందే ప్రతి గ్రామంలోని వాటర్ ట్యాంకులు, చేతి బోర్లు నీటిని పరీక్ష చేసి అవి సురక్షితమా,కాదా అన్నది తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఇంజనీరింగ్ సహాయకులు వారి,వారి సచివాలయ పరిధిలో ఈ పరీక్షలు విధిగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి, కార్యదర్శి మధు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం...

### - ఇందిరా నగర్‌లో డోర్ టూ డోర్ టీడీపీ

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామని పలువురు లబ్ధిదారులు తెలిపారు. టిడిపి తిరుపతి పార్లమెంటు జిల్లా కార్యదర్శి జె డబ్ల్యూ విజయ్ కుమార్ నేతృత్వంలో సోమవారం 24 వ డివిజన్ ఇందిరానగర్ బండ్లమిట్టలో తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమం జరిగింది. జె డబ్ల్యూ విజయ్ కుమార్ నేతృత్వంలో పార్టీ నేతలు ఇందిరానగర్ బండ్ల మిట్టలలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు లబ్ధి పొందిన వారు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ లకు జీవితాంతం రుణపడి ఉంటామని ఆనందాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో జె డబ్ల్యూ విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం మరో మూడేళ్లలో దేశం లోనే నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందబోతోందని తెలిపారు. తిరుపతి నియోజకవర్గం ఇప్పటికే అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తిరుపతి తో ఎంతో విడదీరాని బంధం ఉందని, భవిష్యత్తులో పారిశ్రామికంగా విద్యాపరంగా వైద్య పరంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య పెన్షన్లు వితంతు పెన్షన్లు వికలాంగ పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. 24వ డివిజన్లో ప్రజలకు ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తాము ముందు ఉంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. 24 డివిజన్ టిడిపి నేతలు జె.దిలీప్ మల్లెపూల సుబ్రహ్మణ్యం, చంద్రబాబు, ఏ గంగాధర్ ధనలక్ష్మి కేకే చెల్లప్ప జలకం రాజేష్, బద్రి గోనె రవి శంకర్, మంజునాథ్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైస్ మిల్లులలో తగ్గింపు ధరలకు

# బియ్యం విక్రయాల ప్రారంభోత్సవం

### - 115 రైతు బజార్ల బియ్యం కౌంటర్లలో 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక పాయింట్లు

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి పౌరుడికి చౌక దుకాణాల్లో ఇచ్చే 5 కిలోల రేషన్ బియ్యం సరిపోవడంలేదని రైస్ మిల్లులలో పేదలు తీసుకునే బియ్యపు బస్తాల పై రేట్లు తగ్గించి ఇవ్వాలనే ప్రతిపాదనను తిరుపతి జిల్లా తడ మండలం మాంబట్టు పంచాయతీలోని కట్టవ గ్రామంలో వేనాటి రాజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ పాల్గొన్నారు. తగ్గింపు ధరలకు బియ్యం విక్రయాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉన్న 14 రైస్ మిల్లర్ల యాజమాన్యాలతో మాట్లాడి పేద, మధ్యతరగతి కుటుం



బాలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమంలో తమ వంతు సహాయంగా బియ్యపు బస్తాలపై రేట్లు తగ్గించి ఇవ్వాలని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక ఆదా,ప్రతి కిలో పై 10 నుండి 14 వరకు ఆదా కొరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,ప్రతి రైస్ కార్డు కుటుంబానికి నెలకు 26 కిలోల నాణ్యమైన బియ్యాన్ని ఒకే క్వాలిటీ బ్యాగులో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడ మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి

### - మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య




**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** రాష్ట్రంలో డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. సోమవారం నాయుడుపేటలోజరిగిన నియోజవర్గ స్థాయి వైసిపి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. డీఎస్సీ నియామకాల్లో అన్యాయం జరిగిన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైసిపి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఆగస్టు 6,7,8 తేదీల్లో సూళ్లూరుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే



నిరాహార దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టు 10వ తేదీన సూళ్లూరుపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్డీవో వినతిపత్రం వివరణ తెలిపారు. నియోజకవర్గంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుబంధ విభాగాలు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి,మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక,వైసిపి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా రత్న శ్రీ, నియోజకవర్గ మైనారిటీ సెల్ విభాగం అధ్యక్షులు షేక్ షబ్బీర్,వైసీపీ నాయకులు నాగిరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, చదలవాడ కుమార్, బైనా మల్లికార్జున్ రెడ్డి, పేట చంద్రారెడ్డి, పేర్నాటి రాహుల్,షేక్ రహంతుల్లా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయానికి శాశ్వత ధర్మకర్తను నేనే

- చట్టబద్ధత లేని శ్రీ చెంగాళ్ళమ్మ పరమేశ్వరి ఆలయ అభివృద్ధి కమిటీని వ్యతిరేకిస్తున్నాను
- ఆయకట్ట సర్పంచ్‌గా అభివృద్ధి చేయలేని వాళ్లను, ఆలయ కమిటీ చైర్మన్ హోదాలో అభివృద్ధి చేస్తారా?
- అరవభూమి చంద్రశేఖర్ రెడ్డి



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో వెలసిన శ్రీ చెంగాళమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఎంపికలో రాజకీయ సంసిద్ధత ఉన్న ఇప్పటికి సరైన నిర్ణయం తీసుకుపోవడంపై సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉన్నా భక్తులు ఆలోచనలో పడ్డారు. శ్రీ చెంగాళమ్మ ఆలయ శాశ్వత ధర్మకర్త అరవ భూమి చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ చట్టబద్ధతలేని ఆలయ అభివృద్ధి కమిటీని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని, కమిటీలో ఉన్న ఆరుగురు సభ్యులకు ఆలయాన్ని అభివృద్ధి చేసే అనుభవం ఉందా అని ప్రశ్నించారు. శ్రీ చెంగాళమ్మ ఆలయాన్ని వేనాటి ముని రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కొండేపాటి గంగా ప్రసాద్, రవి సన్నారెడ్డి, దువ్వూరు బాలచంద్రారెడ్డి ఇలా ఎంతోమంది అభివృద్ధి చేశారని తెలిపారు. కొంతమంది నన్ను రాజకీయంగా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అందుకని నేను కోర్టును ఆశ్రయించానని తెలిపారు. అమరావతిలోని హైకోర్టు నందు ఈ చైర్మన్ ఎంపిక విధానం సరైన పద్ధతిలో జరగడం లేదని పిటిషన్ వేయడం జరిగిందని తెలిపారు. శ్రీ చెంగాళ్ళమ్మ పరమేశ్వరి గుడికి ఆలయ అభివృద్ధి కమిటీ అని ఏర్పాటు చేయడం సమంజసం చట్టబద్ధత కాదని,కోర్టులో ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకోవడం సరికాదని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎంపీ టిటిడి బోర్డు మెంబర్ నెలవల సుబ్రహ్మణ్యం శ్రీ చెంగాళమ్మ గుడి అభివృద్ధికి సహకరించారని తెలిపారు. ప్రస్తుతం ఆలయ కమిటీ చైర్మన్ గా ఎంపిక చేయాలని నిర్ణయిస్తున్న తిరుమూరు సుధాకర్ రెడ్డి కారిజాత గ్రామపంచాయతీలో ఆయకట్ట సర్పంచ్‌గా ఉన్నారని, ఆ ఆయకట్ట సర్పంచ్ బాధ్యతనే సరిగా నిర్వర్తించలేని వ్యక్తినే ఆలయ చైర్మన్‌గా దీవించడం సరైన నిర్ణయం కాదని తెలిపారు.

# 23వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

**కదిరి – సూర్య వాస్తవం :** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కరాటే పోటీలలో భాగంగా ఆదివారం విజయవాడలోని మరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో 23వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే ఛాంపియన్షిప్ 2026 పోటీలు స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ,ఈ పోటీల్లో భాగంగా కటా,కుమ్మితే జూనియర్, సబ్ జూనియర్స్, క్యాడిట్, సీనియర్స్ విభాగాలలో ఈ పోటీలో ఈ పోటీలకు అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాల తరఫునుండి 8 మంది పాల్గొనగా బంగారు,1 వెండి, 3 కాంశ్య పథకాలు సాధించారు ,వివరాలు జైన్ పాఠశాల నుండి మోమిన్ షేక్ రబ్బన్ వెండి పతకాన్ని, రిదా ముస్కాన్ కాంశ్య పథకాన్ని సాధించారు. కదిరి నారాయణ పాఠశాల నుండి తన్మైశ్రీ బంగారు,కాంశ్య పథకాన్ని సాధించారు. కదిరి బ్లూమూన్ పాఠశాల నుండి భవిత్ కాంశ్య పథకాన్ని సాధించారు . జూనియర్ క్యాటగిరి విభాగంలో మోమిన్ షేక్ రేహాన్



బంగారు పతకాని సాధించారు ఈ కార్యక్రమంలో మెడల్స్ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు వారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

# పూజా హెగ్డే కొత్త టాలెంట్..

# 'లా లా ల్యాండ్' ట్యూన్‌తో అదరగొట్టిన బుట్టబొమ్మ!

స్టార్ హీరోయిన్, బుట్టబొమ్మ పూజా హెగ్డే సోషల్ మీడియాలో మరోసారి తన అభిమానులను ఆకట్టుకున్నారు. తనలో దాగివున్న సంగీత ప్రతిభను బయటపెడుతూ, ప్రముఖ హాలీవుడ్ చిత్రం 'లా లా ల్యాండ్'లోని థీమ్ సాంగ్‌ను కీబోర్డ్‌పై ప్లే చేస్తున్న వీడియోను సోమవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది."గత కొన్ని రోజులుగా ఈ ట్యూన్ నన్ను వెంటాడుతోంది. దీన్ని ఎలా ప్లే చేయాలో కచ్చితంగా నేర్చుకోవాలనుకున్నాను. ఇక ఇప్పుడు ర్యాన్ గోస్లింగ్ మ్యాజికల్‌గా ప్రత్యక్షమవ్వడమే తరువాయి" అంటూ ఆమె సరదాగా క్యాప్షన్ జోడించారు. ఈ పోస్ట్‌తో పూజాలోని కొత్త కోణాన్ని చూసి అభిమానులు ముగ్ధులవుతున్నారు.ఇదిలా ఉండగా, ఇటీవలే పూజా హెగ్డే తన హెయిర్‌స్టైల్‌ను పూర్తిగా మార్చేసి అభిమానులను ఆశ్చర్యపరిచారు. పొడవాటి



జుట్టుకు వీడ్కోలు పలికి, షార్ట్ హెయిర్‌తో సరికొత్త లుక్‌లోకి మారారు. "ఇకపై నేను షార్ట్ హెయిర్ అమ్మాయిని" అంటూ తన కొత్త హెయిర్‌స్టైల్ వీడియోను పంచుకోగా, నెటిజన్ల నుంచి విశేష స్పందన లభించింది. "షార్ట్ హెయిర్ అయినా, లాంగ్ హెయిర్ అయినా నువ్వు ఎప్పుడూ అందంగానే ఉంటావు" "చాలా అందమైన లుక్" అంటూ ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే పూజా, అంతకుముందు తన వర్కౌట్ సెషన్‌కు సంబంధించిన వీడియోను కూడా పంచుకున్నారు. ట్రెడ్‌మిల్‌పై వెనక్కి నడుస్తూ స్టైల్‌గా వర్కౌట్ చేస్తున్న వీడియో అభిమానులను ఆకట్టుకుంది. ఆరెంజ్ కలర్ క్రాప్ టాప్, మ్యాచింగ్ షార్ట్స్‌లో ఆమె ఫిట్‌నెస్ స్ఫూర్తిని చాటారు.ఇక సినిమాల విషయానికొస్తే, పూజా హెగ్డే చివరిగా 'జన నాయగన్' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలలో డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వస్తున్న రొమాంటిక్ కామెడీ 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'లో కథానాయికగా నటిస్తున్నారు. తన వ్యక్తిగత, వృత్తిపరమైన అప్‌డేట్స్‌తో పూజా నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉంటున్నారు.

# 20 గంటలు నాన్-స్టాప్ షూటింగ్...

## కీర్తి సురేశ్ హార్డ్ వర్క్



జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటి కీర్తి సురేశ్ తన పని పట్ల ఎంత అంకితభావంతో ఉంటారో మరోసారి నిరూపించారు. తన తీరిక లేని పని షెడ్యూల్ గురించి ఆమె ఇన్స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. వరుసగా 20 గంటల పాటు షూటింగ్‌లో పాల్గొన్నానని, మొత్తం 41 గంటలుగా నిద్ర లేకుండా ఉన్నానని వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అయినప్పటికీ, ఇంత బిజీగా ఉండటాన్ని తాను ఒక అదృష్టంగా భావిస్తున్నానని చెప్పడం ఆమె వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తోంది.తన ఇన్స్టాగ్రామ్ స్టోరీస్‌లో కీర్తి సురేశ్ వరుస పోస్టులు పెట్టారు. ఒక వీడియో క్లిప్‌లో మాట్లాడుతూ, "దాదాపు 24 గంటల తర్వాత ఇప్పుడే నా రూమ్‌లోకి అడుగుపెట్టాను. సుమారు 20 గంటలు పనిలోనే ఉన్నాను. నిన్న ఉదయం 6 గంటలకు బయలుదేరాను, ఇప్పుడు ఉదయం 6 అవుతోంది. అసలు విషయం ఏంటంటే, మరో గంటలో నేను తర్వాతి పనికి బయలుదేరాలి. అయినా ఇవి మంచి సమస్యలే కదా, ఇదే జీవితం. దీన్ని నేను ఒక వరంగా భావిస్తాను" అని అన్నారు.మరో పోస్టులో, "నిన్న ఈ పోస్ట్ పెట్టేంత శక్తి కూడా లేదు. ఒక షూట్ నుంచి మరో షూట్‌కు పరుగులు. 41 గంటలు మెలకువగానే ఉన్నాను" అని రాసుకొచ్చారు. ఇంతటి అలసట మధ్య, కేవలం గంట మాత్రమే విరామం దొరికినా, మళ్లీ పనికి వెళ్లే ముందు ఒక మిర్రర్ సెల్ఫీ తీసుకునేంత శక్తి తనకు ఉందని చమత్కరించారు.

ఆ సెల్ఫీని కూడా ఆమె పోస్ట్ చేశారు.అనంతరం మరో షూట్‌కు వెళుతున్న వీడియోను పంచుకున్నారు. ఆ వీడియోలో ఆమె "ఐ విల్ సర్వైవ్ (నేను నిలబడగలను)" అని రాసి ఉన్న టీ-షర్ట్‌ను చూపిస్తూ, "ఈ రోజు ఈ టీ-షర్ట్‌కు నిజంగా ఒక అర్థం ఉంది... అవును నేను నిలబడతాను" అని అన్నారు. ప్రస్తుతం కీర్తి సురేశ్ చేతిలో 'సత్యవాన్ సావిత్రి', 'రఫ్తార్', 'అక్క', 'రౌడీ జనార్ధన' వంటి పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటితో పాటు 'వెంకీ-అనిల్ రావిపూడి5' చిత్రంలో కూడా నటిస్తున్నారు. ఈ వరుస సినిమాలే ఆమె బిజీ షెడ్యూల్‌కు కారణమని స్పష్టమవుతోంది.



# నా శరీరాన్ని యంత్రంలా చూశాను

## : గాయంపై స్పందించిన రష్మిక

ప్రముఖ నటి రష్మిక మందన్న ఇటీవల తాను షూటింగ్ లో గాయపడడంపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాను నటిస్తున్న 'మైసా' సినిమాలోని ఓ డ్యాన్స్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని తెలిపారు. తన గాయం గురించి, విశ్రాంతి గురించి వివరిస్తూ సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. "గాయాలు చాలా బాధిస్తాయి. ఈ విషయం ఎవరికీ తెలియకూడదని నేను నిజంగా ఆశించాను. కానీ, ఇప్పుడు అందరికీ తెలిసింది. ఇన్ని రోజులు కనిపించనందుకు క్షమించండి. నేను మళ్ళీ వచ్చేశాను. ఇది జరిగి కొంతకాలం అయింది. వరుసగా ఇది నాకు మూడో గాయం. నా శరీరాన్ని యంత్రంలా కాకుండా, మనిషి శరీరంలా చూడటం నేను కచ్చితంగా నేర్చుకోవాలి" అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు.తన గాయం తీవ్రతను వివరిస్తూ, "ఈ గాయం గురించి ఎలా చెప్పాలంటే.. మన తుంటికి, కాలికి మధ్య నాలుగు టెండన్లు ఉంటాయి. వాటిలో నా కుడి వైపు ఉన్న ఒక టెండన్ తెగిపోయింది. అది మళ్లీ అతుక్కుంటేనే నేను కాలు పైకి ఎత్తగలను. 'మైసా' సినిమాలోని డ్యాన్స్ షూట్‌లో ఇది జరిగింది. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో ఇదే అత్యంత అగ్రెసివ్ ఫిల్మ్ అని చెప్పొచ్చు. కానీ కంగారు పడకండి. నొప్పి ఉన్నా భరించలేనిది ఏమీ కాదు" అని ఆమె వివరించారు.ఈ గాయాన్ని దేవుడు తనకు బలవంతంగా ఇచ్చిన సెలవుగా భావిస్తున్నానని రష్మిక పేర్కొన్నారు. "నాకు నేనైతే ఎప్పుడూ బ్రేక్ తీసుకోను కాబట్టి, దేవుడే ఈ రూపంలో నాకు విశ్రాంతి ఇచ్చాడనిపిస్తోంది. నాకు తగిలిన ఈ గాయాలన్నీ యాదృచ్ఛికంగా జరిగినవే. ఇది బలవంతపు సెలవు అయినా, నేనేమీ బాధపడటం లేదు. ఈ సమయంలో చాలా పజిల్స్ పూర్తి చేస్తున్నా. వాటిలో నేను ఇంత బాగా ఆడతానని నాకు తెలియదు" అని ఆమె తెలిపారు.వర్కవుట్లు చేయలేకపోవడంపై తన ఆందోళనను కూడా పంచుకున్నారు. "నేను వర్కవుట్లు, రన్నింగ్ బాగా చేయడం వల్లే ఫిట్‌గా ఉంటాను. ఇప్పుడు కొంతకాలం వాటికి దూరంగా ఉండాలి. వర్కవుట్ చేయలేకపోతే నేను తినడం మొదలుపెడతాను. స్వీట్స్ ఎక్కువగా తింటాను. దానివల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఇదే నా అప్‌డేట్. త్వరలోనే మళ్లీ మిమ్మల్ని కలుస్తాను. ఎవరూ కంగారు పడకండి" అంటూ తన అభిమానులకు భరోసా ఇచ్చారు.



# విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్ ప్రయాణం..

# ఆసక్తికర విషయం చెప్పిన సచిన్ టెండూల్కర్

భారత క్రికెట్‌లో ఫిట్‌నెస్ విప్లవానికి ఆద్యుడు విరాట్ కోహ్లీ. కోహ్లీ సాగించిన ఈ అద్భుత ప్రయాణం ఎలా మొదలైందో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఒక సందర్భంలో గుర్తుచేసుకున్నాడు. 2011 ఆస్ట్రేలియా పర్యటనలో చోటుచేసుకున్న ఒక చిన్న సంఘటనే కోహ్లీ ఆలోచనా దృక్పథాన్ని సమూలంగా మార్చేసిందని పేర్కొన్నాడు.2011లో భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సమయంలో, కాన్‌బెర్రాలోని ఒక థాయ్ రెస్టారెంట్?లో సచిన్, కోహ్లీ కలిసి రాత్రి భోజనం చేశారు. డిన్నర్ ముగించుకుని హోటల్‌కు నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో కోహ్లీ సచిన్‌తో "పాజీ, ఇక తిన్నది చాలు.. ఇప్పటి నుంచి ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి" అని అన్నట్లు సచిన్ వెల్లడించాడు. ఈ ఆసక్తికరమైన జ్ఞాపకాన్ని సచిన్ టెండూల్కర్ 2022లో విరాట్ కోహ్లీ 100వ టెస్ట్



మ్యాచ్ సందర్భంలో బీసీసీఐ విడుదల చేసిన ప్రత్యేక వీడియోలో పంచుకున్నారు. "ఆ రోజు సాయంత్రం నువ్వు నీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నావు. ఆ తర్వాత ఫిట్‌నెస్ సాధించడానికి నువ్వు పడని శ్రమ లేదు. మైదానంలో గణాంకాలు ఎలా ఉన్నా, యువతకు నువ్వు ఒక అద్భుతమైన రోల్ మోడల్‌గా నిలిచావు" అని సచిన్ కొనియాడారు.అధికంగా భుజించిన తర్వాత కలిగే అసౌకర్యం లేదా నీరసం వంటి చిన్న అనుభవాలే కొన్నిసార్లు జీవనశైలిలో పెను మార్పులకు పునాది వేస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అప్పుడప్పుడు పరిమితికి మించి ఆహారం తీసుకోవడం పెద్ద సమస్య కాదని, అయితే ఆ తర్వాత మనం క్రమం తప్పకుండా పాటించే ఆరోగ్యకరమైన అలవాట్లే ఫిట్‌నెస్‌ను నిర్ణయిస్తాయని డైటీషియన్లు వివరిస్తున్నారు. సమతుల్య ఆహారం, నిత్యం వ్యాయామం వంటి చిన్న మార్పులే దీర్ఘకాలంలో సత్ఫలితాలను ఇస్తాయి. అడపాదడపా చేసే విందుల కంటే, మన దైనందిన జీవనశైలి మాత్రమే ఆరోగ్యంపై అత్యధిక ప్రభావం చూపుతుందని వారు స్పష్టం చేస్తున్నారు.

# అంతర్జాతీయ వేదికపై

# కశ్మీరీ ఎంఎంఏ ఫైటర్ సత్తా..

### - ఛాంపియన్‌కు చుక్కలు చూపిన ఓవైస్ యాకూబ్

అంతర్జాతీయ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ) యవనికపై ఓ భారతీయ యువకుడు సంచలనం సృష్టించాడు. జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఓవైస్ యాకూబ్, బల్గేరియాలో జరిగిన ప్రతిష్ఠాత్మక బ్రేవ్ సీఎఫ్ 107 ఈవెంట్‌లో అద్భుత విజయాన్ని నమోదు చేశాడు. ఇప్పటివరకు ఓటమి ఎరుగని, రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన బల్గేరియా ఫైటర్ డెల్యన్ జార్జివ్‌ను మట్టికరిపించి చరిత్ర సృష్టించాడు. ఈ విజయం పట్ల జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హర్షం వ్యక్తం చేస్తూ ఓవైస్‌కు అభినందనలు తెలిపారు.ఒమర్ అబ్దుల్లా కార్యాలయం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. "బల్గేరియాలో అజేయ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి అద్భుత విజయం సాధించిన జమ్మూ కశ్మీర్ ఎంఎంఏ ఫైటర్ ఓవైస్ యాకూబ్‌కు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఇది జమ్మూ కశ్మీర్‌తో పాటు దేశానికే గర్వకారణం. భవిష్యత్తులోనూ అతను మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ వేదికపై దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు" అని పేర్కొంది.ఆగస్టు 1న బల్గేరియాలోని బుర్గాస్ ఎరీనాలో జరిగిన ఈ పోరులో ఓవైస్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మొదటి రౌండ్ ప్రారంభమైన కేవలం 4 నిమిషాల్లోనే టెక్నికల్ నాకౌట్ (టీకేఓ) ద్వారా డెల్యన్ జార్జివ్‌ను ఓడించి తన కెరీర్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ఈ ఓటమితో జార్జివ్ కెరీర్‌లో తొలి పరాజయం నమోదైంది. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా మురాన్ గ్రామానికి చెందిన ఓవైస్, ఈ పోరులో అద్భుతమైన నిలకడ, పట్టుదల, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు పొందాడు.విజయం అనంతరం ఓవైస్ యాకూబ్ మాట్లాడుతూ.. "ఈ విజయం నాకు సర్వస్వం. నా కుటుంబం, జమ్మూ కాశ్మీర్ ప్రజలు, యావత్ దేశం ఆశలను మోస్తూ నేను బరిలోకి దిగాను. అజేయ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించడం ఒక కల నిజమైన క్షణం. అయితే ఇది ఆరంభం మాత్రమే. మరింత కష్టపడి పనిచేసి, ప్రపంచ వేదికపై గర్వంగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మరిన్ని విజయాలు సాధిస్తాను" అని అన్నాడు. గతంలో కశ్మీర్ నుంచి పలువురు రెజ్లర్లు జాతీయ స్థాయిలో రాణించినప్పటికీ, ఎంఎంఏ క్రీడలో ఓవైస్ సాధించినటువంటి అంతర్జాతీయ మైలురాయిని ఇంతవరకు ఎవరూ చేరుకోలేదు.





# అమెరికా క్రికెటర్ అఖిలేశ్ రెడ్డిపై

# ఐసీసీ నిషేధం... ఎందుకంటే..!

### అమెరికా క్రికెటర్ అఖిలేష్ రెడ్డిపై ఐసీసీ 8 ఏళ్ల నిషేధం
### అబుదాబి టీ10 లీగ్‌లో అవినీతికి పాల్పడినట్టు నిర్ధారణ
### సహచర బౌలర్‌ను ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరిన వైనం
### ఫోన్‌లోని వాట్సాప్, కాల్ లాగ్స్ డిలీట్ చేసి విచారణను తప్పుదోవ పట్టించే యత్నం

అంతర్జాతీయ క్రికెట్‌లో మరో అవినీతి ఉదంతం కలకలం రేపింది. అమెరికా (యూఎస్ఏ) క్రికెటర్ బొడుగం అఖిలేశ్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎనిమిదేళ్ల పాటు నిషేధం విధించింది. 2025లో జరిగిన అబుదాబి టీ10 లీగ్‌లో అఖిలేశ్ రెడ్డి అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినట్లు తేలడంతో ఐసీసీ ఈ కఠిన చర్యలు తీసుకుంది. ఈ నిషేధం 2025 నవంబర్ 21 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఐసీసీ వెల్లడించింది.ఐసీసీ యాంటీ కరప్షన్ ట్రైబ్యునల్ విచారణలో అఖిలేశ్ రెడ్డిపై మూడు ప్రధాన ఆరోపణలు రుజువయ్యాయి. టీ10 లీగ్‌లో మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం, సహచర ఆటగాడిని ఉద్దేశపూర్వకంగా ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరడం, విచారణను అడ్డుకునే ఉద్దేశంతో తన ఫోన్‌లోని వాట్సాప్ సందేశాలు, కాల్ లాగ్‌లను డిలీట్ చేయడం వంటి నేరాలకు పాల్పడినట్లు ట్రైబ్యునల్ నిర్ధారించింది.2025 నవంబర్ 19న అస్పిన్ స్టాలియన్స్ జట్టు తమ తొలి మ్యాచ్ ఆడటానికి ముందురోజు, అఖిలేశ్ రెడ్డి హోటల్ గదిలో తన సహచర బౌలర్‌ను కలిసి, ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరాడు. టీమ్ మేనేజ్‌మెంట్ సూచన మేరకే తాను ఇలా అడుగుతున్నట్లు అతడిని నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, సదరు ఆటగాడు ఇందుకు నిరాకరించి, ఈ విషయాన్ని వెంటనే ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ దృష్టికి తీసుకెళ్లాడు. విచారణలో భాగంగా ఫోన్‌లోని డేటాను డిలీట్ చేయడంపై అఖిలేశ్ ఇచ్చిన వివరణలను ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. 26 ఏళ్ల అఖిలేశ్ రెడ్డి అమెరికా తరఫున ఇప్పటివరకు నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

# విద్య బోధనకు ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి

**-బదిలీ పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులు తక్షణ రిలీవ్ చేయాలి**

**-ఎస్‌టియు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి**



**రాయచోటి- సూర్య వాస్తవం:**అన్నమయ్య జిల్లాలో 225 సంవత్సరం బదిలీ పొంది రిలీవర్ లేక రిలీవ్ కాలేదని, వారిని వెంటనే రిలీవ్ చేయాలని అన్నమయ్య జిల్లా ఎస్‌టియు అధ్యక్షుడు అంకం శివారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు.ఎస్‌టియు సభ్యత్వ నమోదులో భాగంగా సోమవారం రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రామాపురం మండలంలోని పలు హైస్కూల్స్ సందర్శించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం బదిలీల అనంతరం అనేకమంది ఉపాధ్యాయ పదవీ విరమణ పొందిన సందర్భంగా వారి స్థానాలు ఖాళీగా ఉన్నాయని, అలాంటి వాటికోసం వర్క్ అడ్జస్ట్ ద్వారా సర్దుబాటు చేసినప్పటికీ ఇంకా చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక బోధన కుంటు పడుతున్నదని, దీనిపై అధికా రులు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని సిబ్బందిని నియమించి పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సబ్జెక్టు ఉపాధ్యాయుల లేక చాలా ఇబ్బంది పడుతు న్నారు.

దీనిని ప్రభుత్వం గుర్తించి అకాడమీ ఇన్‌స్ట్రక్టర్స్‌ను తక్షణం పూరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు వై రవీంద్రనాథ్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ సునీర్ సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి, రాజారెడ్డి, మండల అధ్యక్షులు గోపి కృష్ణ, ఆవుల వెంకటరామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర సంక్షేమం - సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- చెన్నూరులో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ఇంటింటి ప్రచారం"**



**చెన్నూరు- సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకునే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ చేపట్టిన "ఇంటింటి ప్రచారం" కార్యక్రమం చెన్నూరు మేజర్ గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి చెన్నూరు లోని వనం వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఎమ్మెల్యే స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకు న్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వ పనితీరు ప్రశంసనీయమని తెలిపారు. అయితే కొంతమంది తమకు 'తల్లికి వందనం', పక్కా గృహాలు, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని కోరగా, మరికొందరు గ్రామంలో సీసీ రోడ్లు కావాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. వనం వీధిలో పాత ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలాగే గ్రామ శ్మశానానికి వెళ్లే దారిలో కొందరు పేద దిబ్బలు వేయడంతో అంత్యక్రియల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయని గ్రామస్థులు వివరిం చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత పంచాయతీ అధికారులకు ఆ దిబ్బలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. చెన్నూరు మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో గ్రామంలో ఎక్కడా మట్టి రోడ్లు ఉండకూడదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, గ్రామంలో ఉన్న ప్రతి మట్టి రహదారిని గుర్తించి దశలవారీగా సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మురుగునీరు, తాగునీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు పనిచేయాలని ఎంపీడీవోకు సూచించారు.

గ్రామంలో రేషన్ కార్డులు రాని అర్హుల సమస్యలను కూడా ఎమ్మెల్యే తెలుసుకుని, అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు చెప్పని అనేక అభివృద్ధి కార్యక్రమాలను కూడా విజయవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపట్టడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని అన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలందరూ కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కల్లూరి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డి, రామకోటి రెడ్డి, షెబ్బీర్, ఖాజా హుస్సేన్, నరసింహులు, నాగేశ్వరరెడ్డి, పవన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, బడిగింజల మురళి తదితరులు పాల్గొన్నారు.



# బీసీ యాదవులు, దళితులపై

# గొడ్డలి పార్టీ ఎమ్మెల్యే దాడి సిగ్గుచేటు

**- వై.నాగేశ్వరరావు యాదవ్ ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు**



**కర్నూల్ - సూర్య వాస్తవం :** కర్నూల్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే విరుపాక్షి దళితులపై బీసీలు యాదవులపై చేసిన దానిని ఖండిస్తూ సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అకేపోగుప్రభాకర్, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, స్టేట్ డైరెక్టర్స్ లక్ష్మీనారాయణ విజయ్ కుమార్ ప్రసాద్, సత్రం రామకృష్ణుడు ప్రభాకర్ యాదవ్ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జేమ్స్ మారెన్న ప్రతాప్ మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ గొడ్డలి పార్టీ ప్రధాన ధ్యేయంగా బీసీలను, బలహీన వర్గాల వారిని హింసించడం, వారిపై దాడులు చేయడమే ధ్యేయంగా పెట్టుకొని గత ప్రభుత్వంలో పాలించడం జరిగింది. ఇప్పుడు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అతని సోదరులు, అనుచరులతో దళితులపై యాదవులపై దాడి చేయడం హేయమైన చర్యగా ఖండిస్తూ, వెంటనే ఎమ్మెల్యేకు అతని అనుచరులకు తగిన శిక్షను అమలు చేసి తగిన బుద్ధి చెప్పాలని పోలీసు అధికారులను కోరడం జరిగింది.

దళిత మహిళను బట్టలు చింపి ఆమెపై దాడి చేయడం ఒక ఎమ్మెల్యేగా నీ దిగజారుడు తనానికి నిదర్శనం, ఆలూరు నియోజ కవర్గంలో ఆడవారికి ఒక ఎమ్మెల్యేగా ఏమి రక్షణ ఇస్తావని సందర్భంగా ప్రశ్నిస్తున్నాం. యాదవులపై దాడి చేస్తే ఊరుకోబోమని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాం. టీడీపీ పార్టీ లో మీ గొడ్డలి పార్టీ ఆగడాలు సాగవని మీరు దానికి తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని ఈ సందర్భంగా హెచ్చరిస్తూ బీసీలకు ఎస్సీలకు ఎస్టీలకు ఎల్లవేళలా అండగా నిలిచే పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలియజేశారు.

# వేరుశనగకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**- మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ షఫీనాయక్**



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** ఖరీఫ్ 2026 కు సబ్సిడీ ద్వారా అందిస్తున్న వేరుశనగ విత్తనకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ షఫి నాయక్ రైతులను కోరారు. సోమవారం లక్కిరెడ్డిపల్లిలోని వ్యవసాయ శాఖ రైతు సాధికారక సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఆహార నూనెల మిషన్ సౌజన్యంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రవాణా శాఖామంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి ఆయన సోదరుడు రాయచోటి టిడిపి నాయకులు లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆదేశం మేరకు రైతులు నీటి సౌకర్యం చూసుకుని వేరుశనగ పంటను సాగు చేసుకొనుట మంచిదన్నారు. ఆధార్ నెంబర్‌కు, సెల్ నెంబర్ లింక్ చేయించుకోన్న వారికి సబ్సిడీ ద్వారా వేరుశనగ కాయలు, యూరియాను కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా సబ్సిడీ ద్వారా కందులను కూడా మండలంలోని రైతుభరోసా కేంద్రాలలో పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు ఏవైనా పంటలో వేసుకుని ఉంటే వెంటనే క్రాబ్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు పక్కిరయ్య, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కొండూరు వెంకట్రామరాజు, మాజీ వైస్ చైర్మన్ విజయ భాస్కర్, టిడిపి నాయకులు రవి ఆచారి, తుమ్మలమల్లికార్జున, మహమ్మద్ భాష, రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు శాఖంబరి అలంకరణలో వాసవి అమ్మవారు



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు వాసవి అమ్మవారు శాకంబరీ దేవి అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు అమ్మవారి శాల అధ్యక్షులు అయ్యప్ప వెంకట సురేష్ బాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం లోని భక్తులు ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొంది అన్న ప్రసాదం స్వీకరించి వెళ్లాలని మహిళలను భక్తులను కోరారు. అమ్మవారి సేవలో అత్యధికంగా మహిళలు పాత్రులు అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుంకు సురేష్ కోశాధికారి వెంకటేశ్వర్లు యువజన సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య కమిటీ సభ్యులు ముచ్చర్ల శేషయ్య పబ్బతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ**

శాకాంబరీ దేవి అలంకరణ మహోత్సవానికి బన్నూరు కృష్ణమూర్తి, వారి కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి**

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ప్రజలకు వివరించారు. సందర్భంగా మండలంలోని సోమిరెడ్డి పల్లె పంచాయతీ ఆశ్రమం లో తెలుగుదేశం పార్టీ చేపట్టిన "ఇంటింటి ప్రచారం" కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వ పనితీరు ప్రశంసనీయమని తెలిపారు. గ్రామంలో ఉండే సమస్యలను కొన్ని ఆయన దృష్టికి తీసుకురాగా మీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరగా పూర్తి అయ్యేలా చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు పూజా శివయ్య యాదవ్ , లగసాని గంగరాజు, నరసనపల్లె,ఆశ్రమం తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# డీఈఓ డాక్టర్ ఎన్. అయ్యూబ్ హుస్సేన్‌కు డీఈఓ కార్యాలయంలో ఘన స్వాగతం..

- పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు
- ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు పాఠశాలల ప్రతినిధుల అభినందనలు
- డైట్ సీనియర్ అధ్యాపకుడి నుంచి జిల్లా విద్యాశాఖాధికారిగా నియామకం



**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)గా డాక్టర్ ఎన్. అయ్యూబ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఆరు జిల్లాలకు కొత్త డీఈఓలను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేయగా, అందులో భాగంగా అనంతపురం జిల్లా డీఈఓగా డాక్టర్ అయ్యూబ్ హుస్సేన్‌ను నియమించారు. ప్రస్తుతం కర్నూలు జిల్లా బి. తాండ్రపాడులోని డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ డీఈఓగా నియమించారు.ఉత్తర్వులు వెలువడిన వెంటనే డాక్టర్ అయ్యూబ్ హుస్సేన్ సోమవారం అనంతపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

అనంతరం డీఈఓ కార్యాలయానికి చేరుకున్న ఆయనను ఏడీ-1 కడప మునీర్ ఖాన్, ఏడీ-2 శ్రీనివాసులు, నోడల్ అధికారి రాంప్రసాద్, ఏపీఓ మంజునాథ్, ఏఎస్ఓ బోయ శ్రీనివాసులు, ఎయిడెడ్ సెక్షన్ అధికారి జగదీశ్, ఐటీ విభాగం చంద్రశేఖర్ రెడ్డి, గుత్తి డిప్యూటీ డీఈఓ లక్ష్మన్నతో పాటు కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్ల అసోసియేషన్ ప్రతినిధులు కూడా నూతన డీఈఓను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

# అనంతలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ విజయవంతం

- నగర వీధుల్లో కదం తొక్కిన నర్సింగ్ విద్యార్థినులు
- తల్లిపాల విశిష్టతపై ప్రతిజ్ఞ.. మానవహారం
- తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి: డాక్టర్ హేమలత
- రాష్ట్రంలో అగ్రస్థానంలో అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్




**అనంతపురం వైద్యం- సూర్య వాస్తవం :** తల్లిపాలతోనే శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలత అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సాగిన ఈ ర్యాలీని డాక్టర్ హేమలత జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్, శిశు వైద్య నిపుణురాలు డాక్టర్ హరిణి, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, ఐఏపీ సెక్రటరీ డాక్టర్ శంకర్ నాయక్, శిశు వైద్య నిపుణుడు డాక్టర్ బాబ్జాన్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు రత్నమయ్య, నరసింహులు, నూరు హెల్త్‌కేర్ ప్రతినిధి శివయ్య పాల్గొన్నారు.ర్యాలీని ఉద్దేశించి డాక్టర్ హేమలత మాట్లాడుతూ, సృష్టిలో తల్లిపాలకు ఉన్న విశిష్టతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డలు ఇద్దరూ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు.మాతృత్వం మహిళలకు దేవుడు ప్రసాదించిన గొప్ప వరమని పేర్కొన్నారు. ప్రసవం అనంతరం శిశువుకు తల్లిపాలు అందించడం మాతృత్వంలో అత్యంత ముఖ్యమైన భాగమని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.తమ పిల్లలకు పాలు ఇచ్చిన అనంతరం మిగిలిన పాలను అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు దానం చేస్తున్న తల్లులను అభినందించారు. అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన మదర్స్ మిల్క్ బ్యాంక్ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం ఆనందకరమని తెలిపారు. తల్లిపాల దానం అత్యంత విలువైన సేవ అని పేర్కొన్నారు.ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలుగు తల్లి విగ్రహం, జిల్లా పరిషత్ మీదుగా సప్తగిరి సర్కిల్‌కు చేరుకుంది. అక్కడ నర్సింగ్ విద్యార్థినులు, వైద్య సిబ్బంది మానవహారంగా ఏర్పడి తల్లిపాల ప్రాధాన్యంపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ తిరిగి జిల్లా పరిషత్ మీదుగా ప్రభుత్వ సర్వజనాస్పత్రి ప్రధాన గేటు వద్దకు చేరుకుంది.ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులు ప్రదర్శించిన అవగాహన నాటిక అందరినీ ఆకట్టుకోవడంతో పాటు తల్లిపాల ప్రాముఖ్యతపై ఆలోచింపజేసింది.ఈ కార్యక్రమంలో మిల్క్ బ్యాంక్ స్టాఫ్ నర్సులు సునీత, మానస, బళ్లారి బోయ లావణ్య, కౌన్సెలర్లు రాధ, పల్లవి, నాగమణి, సాయి, శంకర్ నారాయణ, భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల 21 ఎకరాల భూముల కోసం పోరాడితే నిర్బంధాలా?

- ఉరవకొండలో భారీ పోలీసు మోహరింపుపై విశ్వేశ్వర రెడ్డి ఆగ్రహం
- ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసనకు అనుమతి నిరాకరణపై విమర్శలు
- ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను అణిచివేయడం సరికాదన్న విశ్వేశ్వర రెడ్డి
- ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శ
- ప్రజా సమస్యలపై పోరాటాలకు ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్న
- బాధితుల పక్షాన నిలబడితే కేసులు పెడతామంటూ బెదిరింపులా?



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వైస్సార్సీపీ ఇంచార్జ్ వై విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పేద, బీసీ వర్గాలకు సంబంధించిన 21 ఎకరాల భూముల పరిరక్షణ కోసం నిర్వహించాలనుకున్న నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంపై వైఎస్ఆర్సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉరవకొండలో భారీగా పోలీసులను మోహరించి, పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణిచివేసే చర్యగా ఆయన విమర్శించారు.ఉరవకొండ వంటి చిన్న పట్టణంలో 14 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 200 మందికి పైగా ప్రత్యేక పోలీసు సిబ్బందిని మోహరించడంతో పాటు దాదాపు 28 ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారని విశ్వేశ్వర రెడ్డి ఆరోపించారు. రెండో తేదీ నుంచే వాట్సాప్ గ్రూపుల ద్వారా ధర్నాకు అనుమతి లేదని, వైఎస్ఆర్సీపీ నాయకులు లేదా కార్యకర్తలు పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు ప్రచారం చేశారని పేర్కొన్నారు.పేద వర్గాలకు సంబంధించిన 21 ఎకరాల భూమిని సాగు చేసుకునేందుకు అవకాశం ఇవ్వకుండా, ఆ భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ భూమికి సంబంధించి హైకోర్టు ఉత్తర్వులు, కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ, కిందిస్థాయి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తమకు అనుకూలంగా నివేదికలు తయారు చేయించుకున్నారని విమర్శించారు.భూమిలోని పైపులు, మోటార్లను ధ్వంసం చేసి లక్షల రూపాయల నష్టం కలిగించిన వారిపై కేసులు నమోదు చేయడం లేదని, బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారులు వారికే వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత సంవత్సరం హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసు రక్షణతో ఇదే భూమిలో పంటను కోసుకున్నామని, అప్పట్లో పోలీసుల సమక్షంలోనే పంట సేకరణ జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు అదే చర్యను అక్రమమని పేర్కొని అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు.మోపిడి గ్రామ సర్పంచ్, వైఎస్ఆర్సీపీ నాయకుడు సిద్ధార్థ్ ఇంటి ప్రాంగణంలో ఉన్న నిమ్మ చెట్లను నరికివేశారని, బెలుగుప్ప, కూడేరు మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.ఎమ్మార్వో కార్యాలయం ఎదుట 300 నుంచి 400 మందితో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు పోలీసులను గౌరవప్రదంగా అనుమతి కోరామని, ఇందుకు సంబంధించి లేఖ కూడా సమర్పించామని విశ్వేశ్వర రెడ్డి తెలిపారు.

తొలుత 31వ తేదీ తర్వాత కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించిన పోలీసులు, మూడో తేదీన నిర్వహించేందుకు ప్రయత్నిస్తే అనుమతి లేదని చెప్పడం సరికాదన్నారు.ఒక చిన్న ధర్నాకు ఇంత భారీగా పోలీసులను ఎందుకు మోహరిస్తున్నారు? నిరసనలంటే ప్రభుత్వానికి ఎందుకంత భయం? తప్పు చేసే వారే ప్రజల నిరసనలకు భయపడతారు" అని ఆయన విమర్శించారు.రాజ్యాంగ బద్ధంగా నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, సుప్రీంకోర్టు కూడా ఈ హక్కును గుర్తించిందని పేర్కొన్నారు. ధర్నాలు చేయకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పోలీసులు చెప్పిన తేదీలకే రాజకీయ పార్టీలు కార్యక్రమాలు నిర్వహించాలా? లేక పార్టీ నిర్ణయించిన విధంగా ప్రజా సమస్యలపై పోరాడాలా? అని ప్రశ్నించారు.కూడేరు ప్రాంతంలో తాగునీటి సమస్యపై ప్రజలు ధర్నా చేస్తే అంబులెన్సులకు అడ్డుపడుతున్నా రంటూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పోలీసు వ్యవస్థను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయలేదని, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులతో పోలీసులు మర్యాదగా వ్యవహరించేవారని పేర్కొన్నారు.ప్రస్తుతం పోలీసు అధికారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ నాయకులను అరెస్టు చేయడం, కొందరిని ఇళ్లకే పరిమితం చేయడం, ఇతర నాయకులను నిర్బంధించేందుకు ప్రయత్నించడం వంటి చర్యలను తప్పుబట్టారు. ఇలాంటి నిర్బంధ చర్యలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని హెచ్చరించారు.అనంతరం వైఎస్ఆర్సీపీ నాయకుడు రమేష్ గౌడ్ మాట్లాడుతూ, ఉరవకొండ నియోజకవర్గంలోని బీసీ వర్గాల ప్రజలు తమ భూములను రక్షించాలని కోరుతూ విశ్వేశ్వర రెడ్డి నాయకత్వంలో పోరాటం చేస్తున్నారని తెలిపారు. భూములను లాక్కున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన వారిని అడుగడుగునా అడ్డుకున్నారని ఆరోపించారు.బీసీలపై కక్షసాధింపు చర్యలు మంచివి కావని హెచ్చరించారు.

గతంలో బాధితుల పక్షాన ఎస్పీ, కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను కలిసి సమస్యను వివరించామని తెలిపారు. బీసీలకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో విశ్వేశ్వర రెడ్డి అండగా ఉంటారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరువు సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలి: బి. గిడ్డయ్య

**అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి**
**ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్**




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు.సోమవారం సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక చదువుల రామయ్య భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా బి. గిడ్డయ్య మాట్లాడుతూ, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అరకొరగా కురిసిన వర్షాలను ఆశ్రయించి రైతులు వేరుశనగ, పత్తి, టమోటా, కంది, ఉల్లి, మిరప, సజ్జ, జొన్న తదితర పంటలను విస్తారంగా సాగు చేశారని తెలిపారు. అయితే ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుతున్నప్పటికీ సరైన వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు మొలక దశలోనే ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట పెట్టుబడుల కోసం రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.2 లక్షల వరకు అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలని కోరారు.కరువు నివారణ చర్యల్లో భాగంగా రైతులు, పేద ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 15 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని, పశువులకు ఉచితంగా పశుగ్రాసం అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాలు కురిస్తే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు.కరువు పరిస్థితుల దృష్ట్యా రైతు కుటుంబాలకు 10 నెలల పాటు నెలకు రూ.20 వేల చొప్పున కరువు పింఛన్లు మంజూరు చేయాలని బి. గిడ్డయ్య కోరారు. అనంతరం తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, పెద్ద ఈరన్న, గిడ్డయ్య గౌడ్, నెట్టికంటయ్య, ప్రజా సంఘాల నాయకులు వెంకటరామిరెడ్డి, జౌహరాపురం కాశి, వెంకటరాముడు, ఎం.కే. సుంకన్న, మాదన్న, రాజప్ప, నరసింహులు, సిద్ధలింగప్ప, ఉరుకుందు, అల్తాఫ్, శంకర్, ఆంజనేయ, నాగరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# కూడేరు మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రరెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

**కూడేరు - సూర్య వాస్తవం :** ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడేరు మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రరెడ్డిని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి వారి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు.ఈ సందర్భంగా బైరెడ్డి రామచంద్రరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న విశ్వేశ్వరరెడ్డి, వైద్యులు సూచించిన విధంగా పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.బైరెడ్డి రామచంద్రరెడ్డి త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని విశ్వేశ్వరరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

